R.N.I.NO : APTEL16159

# జనసూర్య శ్రీ

janasurya. com

సంపుటి : 2 | సంచిక : 187 | అనంతపురము | సంపాదకులు : ఓగేటి భాస్కర | ఆదివారం 29 అక్టోబర్ 2023 | పేజీలు -10 | వెల : 5

# రాష్ట్ర ఉత్సవంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

## ఘనంగా జరపాలని సిఎం జగన్ సర్కార్ ఆదేశాలు..






**అమరావతి అక్టోబర్ 28 (జన సూర్య శ్రీ)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా జరపాలని జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర విభజన తర్వాత తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించలేదు. రాష్ట్ర విభజన అమల్లోకి వచ్చిన అపాయింట్ డే అయిన జూన్ 2 ను రాష్ట్ర అవతరణ దినోత్సవం కాకుండా నవ నిర్మాణ దీక్ష చేపట్టేవారు. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా విజయవాడ బెంజి సర్కిల్ వేదికగా రాష్ట్ర ప్రభుత్వం నవ నిర్మాణ దీక్షలు చేపట్టింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించింది. తెలంగాణ ఏపీలో కలవక ముందు ఉన్నప్పటి అవతరణ దినోత్సవం రోజు నవంబర్ ఒకటో తేదీని అధికారికంగా -మిగతా2లో

## మరణించిన కుమారుడి ఆస్తికి ఫస్ట్ క్లాస్ వారసురాలు తల్లే..

### కర్ణాటక హైకోర్టు కీలక తీర్పు



**బెంగళూరు అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ)**

ఉమ్మడి కుటుంబంలో మరణించిన కుమారుడి ఆస్తికి ఆమె తల్లి క్లాస్-1 వారసురాలిగా మారుతుందని కర్ణాటక హైకోర్టు తీర్పు చెప్పింది. టీఎన్ సుశీలమ్మ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ హెచ్‌పీ సందేశ్.. మరణించిన కొడుకు ఆస్తిపై తల్లికి ఎలాంటి హక్కులు ఉండవంటూ చిక్కమగళూరు జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును కొట్టివేశారు. మరణించిన కుమారుడి ఆస్తికి తల్లి ఫస్ట్ క్లాస్ వారసురాలు అవుతుందని తీర్పులో పేర్కొన్నారు. కేసు విచారణ సందర్భంగా ప్రతివాదుల తరపు న్యాయవాది సెషన్స్ కోర్టు తీర్పును సమర్థించారు. పిత్రార్జిత ఆస్తిలో ఆమెకు వాటా కేటాయించే సమయానికే సుశీలమ్మ కుమారుడు మరణించాడని, కాబట్టి సెషన్స్ కోర్టు ఆదేశాలను సవరించాల్సిన అవసరం లేదని వాదించారు. ఈ వాదనలను హైకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. మరణించిన కుమారుడు సంతోష్ ఆస్తికి ఆమె ఫస్ట్ క్లాస్ -మిగతా2లో

# దమ్ముంటే ఆధారాలు బయట పెట్టండి

- నిజంగానే ఆధారాలు ఉంటే 50 రోజులుగా ఏం చేస్తున్నారంటూ ప్రభుత్వంపై లోకేశ్ ఫైర్
- చంద్రబాబుపై కేసులకు సంబంధించిన ఆధారాలు ప్రజల ముందు పెట్టాలని డిమాండ్
- ఇదే శ్రద్ధను రైతుల సమస్యలు తీర్చడంలో చూపించాలని ప్రభుత్వానికి హితవు
- చంద్రబాబును జైలులోనే చంపేస్తామంటున్నారని విమర్శ



**విజయవాడ**

చంద్రబాబుపై కేసులకు సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయంటున్నారు.. మరి 50 రోజులుగా వాటిని బయటపెట్టకుండా ఏంచేస్తున్నారని వైసీపీ నేతలపై నారా లోకేశ్ తీవ్రంగా మండిపడ్డారు. రాజకీయ ప్రత్యర్థులను ఎన్నికల్లో ఓడించేందుకు ప్రయత్నించడం సహజమేనని, అయితే ప్రత్యర్థిని చంపాలని చూడడం వైసీపీ నేతలకే చెల్లిందని ఆయన ఆరోపించారు. -మిగతా2లో



## సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లా... దేశంలో ఎక్కడైనా ఉందా?

- రిజిస్ట్రేషన్ల వ్యవస్థను ప్రభుత్వం నీరుగార్చిందన్న అశోక్ బాబు
- సచివాలయాల్లో జరిగే రిజిస్ట్రేషన్లపై ప్రజల్లో సందేహాలు ఉన్నాయని వెల్లడి
- తక్షణమే ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్

## 50 దాటిన పోలీసులకు రిటైర్మెంట్

### యూపీ ప్రభుత్వ నిర్ణయం




## వైసీపీ ప్రభుత్వంలోనే సామాజిక న్యాయం

- లోకేష్, భువనేశ్వరి సభలు జనాలు లేక వెలవెలబోతున్నాయి
- మత్స్యకారుల తోలు తీస్తానంటూ చంద్రబాబు బెదిరించారు
- తాను నిప్పంటూ ఇన్నాళ్లు చెప్పిన చంద్రబాబు.. స్కీమ్‌ల పేరిట అన్ని స్కామ్‌లు చేసి జైల్లో ఉన్నారు
- 'సామాజిక న్యాయం జరిగింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే

**విశాఖపట్నం**

ఉత్తరాంధ్రలో మూడో రోజు వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర కొనసాగుతోంది. భీమిలో శనివారం బస్సు యాత్ర ప్రారంభమైంది. ఈ కార్యక్రమం లో మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగు నాగార్జున, కారుమూరి నాగేశ్వరరావు, సీదిరి అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నేతలు, శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు. తగరపువలస ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ.. లోకేష్, భువనేశ్వరి సభలు జనాలు లేక వెలవెలబోతున్నాయని విమర్శించారు. మత్స్యకారుల తోలు తీస్తానంటూ చంద్రబాబు బెదిరించారని మండిపడ్డారు. మత్స్యకారులను దూషించిన చంద్రబాబును ఎవరైనా మరిచిపోతారా అని ప్రశ్నించారు. చంద్రబాబు.. దొరికిన దొంగ అని, -మిగతా2లో

## రూ.20 కోట్లు ఇవ్వకపోతే ముఖేష్ అంబానీని చంపేస్తాం



### కలకలం రేపుతోన్న ఈమెయిల్

**ముంబయి అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ)**

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ ని చంపుతామని ఓ బెదిరింపు మెయిల్ రావడం వ్యాపార వర్గాల్లో కలకలం రేపింది..పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముకేష్ అంబానీకి చెందిన ఓ జీ మెయిల్‌కి శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మెసేజ్ పంపాడు. అందులో మీరు రూ. 20కోట్లు ఇవ్వకపోతే చంపేస్తాం. భారత్‌లో అత్యుత్తమ షూటర్లు మా వద్ద ఉన్నారు అని ఉంది. అప్రమత్తమైన అంబానీ భద్రతా అధికారులు పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ చేశారు. -మిగతా2లో

## పండగ వాతావరణంలో వాల్మీకి మహర్షి రాష్ట్రస్థాయి జయంతోత్సవం

- రామాయణాన్ని రచించి ప్రపంచానికి గొప్ప సందేశాన్ని అందజేసిన వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయుడు
- రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కే.వి.ఉషాశ్రీచరణ్
- అందరికీ ఆదర్శవంతుడు వాల్మీకి మహర్షి
- బి అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర, రామాయణం గురించి భవిష్యత్ తరాలకు తెలియజేయాలి బిబిజిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ



**అనంతపురం, బ్యూరో అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ )**

జిల్లాలో పండగ వాతావరణంలో వాల్మీకి మహర్షి రాష్ట్రస్థాయి జయంతోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కే.వి.ఉషాశ్రీచరణ్ పేర్కొన్నారు.అనంతపురం నగరంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్దనున్న కెఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి రాష్ట్రస్థాయి జయంతోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కే.వి.ఉషాశ్రీచరణ్, ఎంపీ తలారి రంగయ్య, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్ పర్సన్ పొగాకు రామచంద్ర, విజయవాడ వాల్మీకి బోయ కార్పొరేషన్ ఎండి డి.చంద్రశేఖర్ రాజు, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. -మిగతా2లో

# పండగ వాతావరణంలో వాల్మీకి మహర్షి రాష్ట్రస్థాయి జయంతోత్సవం





-మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అంతకుముందు నగరంలోని పవర్ ఆఫీస్ నుంచి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్దనున్న కెఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వరకు పెద్దఎత్తున మహిళలు, విద్యార్థులు బోనాలతో ర్యాలీ నిర్వహించి అక్కడ ఏర్పాటుచేసిన వాల్మీకి మహర్షి విగ్రహానికి బోనాలు సమర్పించడం జరిగింది.

ఈ సందర్భంగా మంత్రి కే.వి.ఉషాశ్రీచరణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వాల్మీకి మహర్షి జయంతోత్సవం చాలా ఘనంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. ఎక్కువగా బీసీలున్న అనంత జిల్లాలో పండగ వాతావరణంలో రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని జరుపుకుంటున్నామన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారలాంఛనాలతో వాల్మీకి మహర్షి జయంతోత్సవాన్ని నిర్వహించడానికి ప్రోత్సాహం అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించి గొప్ప సందేశాన్ని ప్రపంచానికి అందజేశారన్నారు. ప్రతి ఒక్కరు సోదర భావంతో ఉండాలని వాల్మీకి అందించిన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న వెనుకబడిన బీసీలందరినీ గుర్తించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, పదవుల్లో ఎక్కువగా బీసీలకు అవకాశం ఇచ్చారని, గ్రామస్థాయిలో వాల్మీకులకున్న సమస్యలు పరిష్కరించేందుకు ఒక కమిటీని వేసి నివేదికలు తెప్పించుకోవడం హర్షనీయమన్నారు. గతంలో బీసీలను ఓటు బ్యాంకు కోసం వాడుకున్నారని, అయితే సీఎం జగనన్న బీసీలను బ్యాక్వర్డ్ క్యాస్ట్ కాదని బెటర్ క్యాస్ట్ గా భావించి అందర్నీ ముందుకు నడిపిస్తున్నారన్నారు. బీసీల తరఫున రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ప్రజలకు వాల్మీకి మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. సమస్త మానవాళికి జీవన ప్రమాణాలు ఏ విధంగా ఉండాలి అని రామాయణాన్ని రచించి వాల్మీకి మహర్షి ఆదికవిగా పేరుగాంచారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన జీవిత చరిత్ర గురించి, రామాయణం గురించి భవిష్యత్ తరాలకు తెలియజేసి సమాజంలో ఏ విధంగా మెలగాలి అనే దానిపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సామాజిక న్యాయంతో పాటు సమన్యాయం చేస్తూ బీసీలకు రాజకీయంగా ఎదిగేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంతగానో ప్రోత్సహిస్తున్నారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా, జడ్పీ చైర్మన్ గా, ఎమ్మెల్సీగా, ఎంపీగా, మార్కెట్ యార్డ్ చైర్మన్గా, కార్పొరేటర్లుగా, మున్సిపల్ చైర్మన్ గా కూడా వాల్మీకి మహిళలకు, సామాజిక వర్గానికి చెందినవారికి రాజకీయంగా ప్రాధాన్యత కల్పించారన్నారు. వాల్మీకులు సమాజంలో గౌరవంగా ఎదిగేందుకు అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు తెలియజేశారు.

**అందరికీ ఆదర్శవంతుడు వాల్మీకి మహర్షి - ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి**

ఈ సందర్భంగా అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి అందరికీ ఆదర్శవంతుడన్నారు. వాల్మీకి మహర్షి రచించిన రామాయణం కుటుంబ వ్యవస్థ ఎలా ఉండాలి, అన్నదమ్ములు, భార్యాభర్తల మధ్య అనుబంధం, కుటుంబ వ్యవస్థలో అనుబంధాలు ఎలా ఉండాలి అనేది గొప్పగా రచించారని, అందరికీ ఆదర్శప్రాయుడయ్యారన్నారు. ప్రపంచ చరిత్రపుటల్లో వాల్మీకి ఉన్నంతవరకు కూడా రామాయణం ఉంటుందని, రామాయణం ఉన్నంతవరకు వాల్మీకి కూడా ఉంటారన్నారు. మనిషి కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చు అనేది ప్రపంచానికి చాటి చెప్పిన వారు వాల్మీకి మహర్షి అన్నారు. చదువు యొక్క ప్రాముఖ్యతను ఆనాడే చెప్పడం జరిగిందని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నారు. వేటగాడు నుంచి చదువు నేర్చుకుని వాల్మీకి రామాయణాన్ని రచించారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికార లాంఛనాలతో వాల్మీకి జయంతోత్సవాన్ని నిర్వహించడం జరిగిందని, మూడుసార్లు అనంతలోనే వాల్మీకి జయంతోత్సవాన్ని నిర్వహించడం ఎంత సంతోషకరమన్నారు. వాల్మీకులు విశ్వాసానికి, సాహసానికి మారుపేరన్నారు. సమాజంలో వాల్మీకులు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ముందుకు పోవాలని, అందరూ బాగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ గ్రంధి వెంకటేష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ డిడి ఖుష్బూ కొఠారి, జిల్లా టూరిజం అధికారి నాగేశ్వర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, వాల్మీకి, ఇతర సంఘాల నాయకులు, మహిళలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మనకు మళ్లీ జగనన్నే కావాలి

**బాపట్ల:** వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారిత బస్సుయాత్రలో భాగంగా మూడో రోజు బాపట్లలో నిర్వహించిన సభలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు ప్రసంగించారు. ఈ సభకు హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి నేతలు మాట్లాడారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. 'వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారిత బస్సుయాత్ర చేపడితే నారా లోకేష్ ఇది గాలి యాత్ర అంటూ చులకనగా మాట్లాడుతున్నాడు. లోకేష్ ఇది గాలి యాత్ర కాదు.. దండయాత్ర అనే విషయాన్ని గుర్తుపెట్టుకో. మన సామాజిక యాత్రను చులకనగా మాట్లాడుతున్నారు. బీసీ, ఎస్టీలను తేలిక చేసి మాట్లాడుతున్న లోకేష్‌కు గుణపాఠం చెబుదాం. సీఎం జగన్‌ను పీకేస్తాం.. తేల్చేస్తాం అంటూ ఏదో చెత్త వాగుడు వాగుతున్నారు. సీఎం జగన్ ఏమైనా మొక్క అనుకున్నారా.. పీకేయడానికి. సీఎం జగన్ ఒక వీరుడు, ధీరుడు, దమ్మున్న నాయకుడు' అని మరోసారి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే పోతుల సునీత మాట్లాడుతూ.. 'సామాజిక సాధికారితకు ఒక కొత్త నిర్వచనం ఇచ్చారు మన సీఎం జగనన్న. సామాజిక సాధికారితతో ఒక ఉద్యమాన్ని సృష్టించారు. అంబేద్కర్, పూలే, అల్లూరి సీతారామారాజు స్ఫూర్తితో, వైఎస్సార్ ఆశయాలతో సామాజిక సాధికారితకు శ్రీకారం చుట్టారు మన జగనన్న. పేదలకు కష్టాల్లో అండగా నిలబడి అందరికి నేనున్నాను అనే భరోసా ఇచ్చారు. మహిళా సాధికారితకు కూడా సీఎం జగన్ ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. గత ప్రభుత్వం మహిళలను ఓటు బ్యాంకుగా చూసేరే కానీ మహిళా సాధికారిత గురించి ఏనాడు ఆలోచించలేదు. చంద్రబాబువి మోసపూరిత హామీలే. గత ప్రభుత్వ పాలనకు నేటి పాలనకు తేడా గమనించండి. అందరికీ అండగా నిలబడ్డ మన జగనన్న మళ్లీ రావాలి

## ఏపీలో యాత్ర కాలం....

ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ పథకాలు? ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షపై విస్తృతంగా ప్రచారం చేయాలని భావిస్తోంది వైసీపీ. ఆ దిశగా జగన్ దిశా నిర్దేశం చేశారు కూడా. మూడు ప్రాంతాలను కవర్ చేస్తూ 60 రోజులు పాటు సాగేలా సామాజిక న్యాయ యాత్రను డిజైన్ చేశారు.

ఇలా రాష్ట్రవ్యాప్తంగా 3 ప్రాంతాల్లో డిసెంబర్ 31 వరకూ 60 రోజుల పాటు సభలు జరుగుతాయి. రాష్ట్రంలోని ప్రతినియోజకవర్గంలో ఈ యాత్ర ఉంటుంది. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, తలశిల రఘురాంలకు సమన్వయ బాధ్యతలు అప్పగించారు సీఎం జగన్.మరోవైపు.. టీడీపీ కూడా ధీటుగా యాత్రలు చేపడుతోంది. చంద్రబాబు అరెస్ట్ తర్వాత.. టీడీపీ శ్రేణులు ఎక్కడికక్కడ డీపడిపోయాయి.

# సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లా... దేశంలో ఎక్కడైనా ఉందా?



ప్రభుత్వానికి అధిక ఆదాయం తెచ్చిపెట్టే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సచివాలయాలకు అప్పగిస్తూ ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం లోపభూయిష్టం అని టీడీపీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడైనా ఇంత విడ్డూరం ఉందా? అని ఆయన ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సచివాలయ సిబ్బందికి అప్పగించిన ప్రభుత్వం... పారదర్శకంగా, పకడ్బందీగా జరగాల్సిన పనిని అపహాస్యంగా మార్చి ప్రజల్ని ఇబ్బంది పెడుతోందని అశోక్ బాబు విమర్శించారు. రిజిస్ట్రేషన్లు సచివాలయాల్లో జరుగుతాయన్న ప్రభుత్వం, నిర్ణయం మొత్తం రిజిస్ట్రేషన్ల వ్యవస్థనే నీరుగార్చిందని అన్నారు. వ్యవస్థల్లో జగన్ రెడ్డి జోక్యం పరాకాష్ఠకు చేరిందని, మైనింగ్, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్ శాఖల వంటి ఆదాయార్జన శాఖలను కూడా వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. అశోక్ బాబు ఇవాళ మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రిజిస్ట్రేషన్ల అంశంలో ప్రభుత్వం తీరును ఎండగట్టే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త రిజిస్ట్రేషన్ విధానానికి సంబంధించిన పూర్తి సమాచారంతో తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

"జగన్ రెడ్డి ఎప్పుడైతే ప్రజా రాజధాని అమరావతిపై తన రాజకీయ కుట్రల పడగ విప్పాడో అప్పటినుంచే రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయానికి గండిపడింది. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా పడిపోయి, భూముల క్రయవిక్రయాలు మందగించాయి. రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం దారుణంగా పడిపోవడానికి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యలు కూడా కొంతవరకు దోహదం చేశాయి" అని వ్యాఖ్యానించారు. "గతంలో రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే రిజిస్ట్రేషన్లు ఎంతో పారదర్శకంగా, పకడ్బందీగా జరిగేవి. కానీ జగన్ సర్కార్ తీసుకొచ్చిన కొత్త విధానంతో రిజిస్ట్రేషన్ల వ్యవహారమంతా చిల్లర వ్యాపారంగా మారిపోయింది. రిజిస్ట్రేషన్ల తంతుని సచివాలయ వ్యవస్థకు అప్పగించిన ప్రభుత్వం... గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉండే సిబ్బంది, అక్కడి పరికరాలు, ఇతర పరిజ్ఞానంతో ఎంతవరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సమర్థవంతగా నిర్వహించవచ్చని ఆలోచించిందా? కొనుగోలు, అమ్మకందారులతో పనిలేకుండా, వారు ప్రత్యక్షంగా అందుబాటులో లేకున్నా పంచాయతీ కార్యదర్శులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం డాక్యుమెంట్స్ కూడా తమ వద్దే ఉంచుకుంటామని, క్రయవిక్రయ దారులకు కేవలం జిరాక్స్ పత్రాలు మాత్రమే ఇస్తామని అధికారులు చెబుతున్నారు. ఒరిజినల్ డాక్యుమెంట్స్ తమకు ఇవ్వకుండా, తూతూ మంత్రంగా జరిగే రిజిస్ట్రేషన్లకు ఎంతవరకు చట్టబద్ధత ఉంటుందనే సందేహం ప్రజలకు ఉంది. సచివాలయాల్లో జరిగే రిజిస్ట్రేషన్లకు సంబంధించిన డాక్యుమెంట్స్ ను బ్యాంకులు పరిగణనలోకి తీసుకోవడం లేదు. కొత్త రిజిస్ట్రేషన్ విధానం పాలకులకే మేలు చేస్తుందని, ప్రజల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ ను తనఖా పెట్టి ప్రభుత్వమే రుణాలు పొందుతోందనే ప్రచారం ఎక్కువైంది. ఇలా జరిగే ప్రచారాన్ని ప్రజలు కూడా నమ్ముతున్నారు.

## చంద్రబాబుకు రక్షణగా ఆర్థికమంత్రి బంధువా... చంద్రబాబును ఏం చేయాలనుకుంటున్నారు?

రాజమండ్రి జైలులో చంద్రబాబుకు రక్షణగా ఆర్థికమంత్రి బంధువు (డీఐజీ రవికిరణ్)ను పెట్టడంలో ఆంతర్యం ఏమిటని టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమా సీఎం జగన్ ను నిలదీశారు. జైల్లో చంద్రబాబును ఏం చేద్దామనుకుంటున్నారు? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఉన్న జైలుపై డ్రోన్ ఎగిరింది, పెన్ కెమెరా దొరికింది... కానీ ఒక్క అధికారిని కూడా ఎందుకు సస్పెండ్ చేయలేదు? అంటూ ఉమా ప్రశ్నించారు. పైగా, సాయంత్రం 6 గంటలు దాటిన తర్వాత జైల్లోకి డీజీపీ వెళ్లాలన్నా ఆంక్షలు ఉంటాయి... అలాంటిది జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ జైలు పరిసరాల్లో ప్రెస్ మీట్ ఎలా ఏర్పాటు చేస్తారంటూ మండిపడ్డారు.

## రాష్ట్ర ఉత్సవంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

-మొదటి పేజి తరువాయి

ప్రకటించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది సీఎంవో, రాజ్ భవన్‌తో పాటు అన్ని జిల్లాల్లో అవతరణ ఉత్సవాలు..నవంబర్ ఒకటో తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా జరపాలని జగన్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ఉత్సవంగా అత్యంత వైభవంగా జరపాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీనికి సంబంధించి అన్ని జిల్లాల కలెక్టర్లకు, ఎస్పీలకు సాధారణ పరిపాలన శాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఉత్సవాల్లో పాల్గొనున్నారు. రాజ్ భవన్‌లో జరిగే వేడుకల్లో గవర్నర్ పాల్గొననున్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం రోజున ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి జగన్ జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. ఆ తర్వాత పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారు. తెలుగు సంస్కృతిని ప్రతిబింభించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో కూడా రాష్ట్ర అవతరణ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆయా జిల్లాలోని అధికార యంత్రాంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## మరణించిన కుమారుడి ఆస్తికి ఫస్ట్ క్లాస్ వారసురాలు తల్లే..

-మొదటి పేజి తరువాయి

వారసురాలు అవుతుందని స్పష్టం చేసింది. సంతోష్‌కు తల్లి, భార్య, కుమారుడు ఉన్నారు. హిందూ అవిభాజ్య కుటుంబంలో సుశీలమ్మే ఫస్ట్ క్లాస్ వారసురాలు అవుతుందని, కాబట్టి సంతోష్ ఆస్తిలో అసలు అప్పీలుదారైన సుశీలమ్మకు వాటా దక్కుతుందని పేర్కొంది. సెషన్స్ కోర్టు తీర్పు లోపభూయిష్టంగా ఉందని పేర్కొంటూ దానిని కొట్టివేసింది.

## రూ.20 కోట్లు ఇవ్వకపోతే ముఖేష్ అంబానీని చంపేస్తాం..

-మొదటి పేజి తరువాయి

షాబాద్ ఖాన్ అనే వ్యక్తి ఈ బెదిరింపు ఈమెయిల్ పంపినట్లు పోలీసులు తెలిపారు.. ముంబయిలోని గామ్‌దేవి పోలీసులు నిందితుడిపై ఐపీసీ 387, 506 (2) సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అంబానీ, అతని కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని బెదిరింపు కాల్స్ చేసినందుకు బిహార్‌కు చెందిన మరొకరిని ముంబయి పోలీసులు గతేడాది అరెస్టు చేశారు. దక్షిణ ముంబయిలోని అంబానీ కుటుంబ నివాసం 'యాంటిలియా'తో పాటు హెచ్ఎన్ రిలయన్స్ ఫౌండేషన్ హాస్పిటల్‌ను పేల్చేస్తామని అతను బెదిరించాడు. 2021లో యాంటిలియా వెలుపల 20 పేలుడు జెలిటిన్ స్టిక్స్, బెదిరింపు లేఖతో కూడిన స్కార్పియో కారు పట్టుబడింది. ఆ లేఖలో "యే సిర్ఫ్ ట్రైలర్ హై" అని రాసి ఉంది. ఇలా వరుస బెదిరింపు ఘటనలతో అంబానీ భద్రతా దళ సిబ్బంది అప్రమత్తమయ్యారు..

## ఏపీ ఆర్థిక మంత్రి బుగ్గనకు యనమల లేఖ

**ఆర్థికశాఖ ఉన్నతాధికారి రావత్ కు రాసిన యనమల**

**తగిన వివరాలు ఇవ్వకపోవడంతో తాజాగా మంత్రి బుగ్గనకు లేఖ**

**శాసనమండలి విపక్ష నేత హోదాలో తాను అడిగిన వివరాలు ఇవ్వాలని స్పష్టీకరణ**

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు లేఖ రాశారు. ఏపీ ఆర్థికశాఖ ఉన్నతాధికారి రావత్ కు లేఖ రాసినా వివరాలు ఇవ్వకపోవడంతో యనమల తాజాగా బుగ్గనకు లేఖాస్త్రం సంధించారు. శాసనమండలిలో విపక్ష నేత హోదాలో తాను అడిగిన వివరాలు ఇవ్వాలని బుగ్గనను కోరారు. బుగ్గనకు రాసిన లేఖలో యనమల 2021-22 సంవత్సర కాగ్ నివేదికను ప్రస్తావించారు. 67 ప్రభుత్వ రంగ సంస్థలు ఆడిట్ సంస్థకు లెక్కలు సమర్పించకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సెప్టెంబరు 30 నాటికి ఏపీకి ఉన్న అప్పుల వివరాలు తెలపాలని యనమల స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లు, విద్యుత్ సంస్థల బకాయిల వివరాలు ఇవ్వాలని... ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల లెక్కలు అందించాలని కోరారు.

## చంద్రబాబు వయసు, ఆరోగ్య రీత్యా ఆయనకు బదులు నన్ను జైల్లో ఉంచండి: సీఎం జగన్ కు మాగంటి బాబు విజ్ఞప్తి

**స్కిల్ కేసులో చంద్రబాబు అరెస్ట్**

**గత 50 రోజులుగా రాజమండ్రి జైల్లో రిమాండ్**

**చంద్రబాబు పరిస్థితి పట్ల మాజీ ఎంపీ మాగంటి బాబు తీవ్ర విచారం**

**వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనకు కలలో కనిపించారని వెల్లడి**

**జగన్ కు మంచి చెడులు చెప్పమన్నారని వివరణ**

స్కిల్ డెవలప్ మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు గత 50 రోజులుగా రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. పార్టీ అధినేత పరిస్థితి పట్ల టీడీపీ మాజీ ఎంపీ మాగంటి బాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చంద్రబాబు బదులు తాను జైల్లో ఉంటానని, సీఎం జగన్ అందుకు అంగీకరించాలని కోరారు. ఇవాళ నూజివీడులో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాగంటి బాబు మాట్లాడుతూ... చంద్రబాబు వయసు, ఆరోగ్యం తదితర విషయాలను పరిగణనలోకి తీసుకుని, ఆయనకు బదులు తనను జైల్లో పెట్టాలని జగన్ కు విజ్ఞప్తి చేస్తున్నానని తెలిపారు. అంతేగాకుండా, రాత్రి కలలోకి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వచ్చారని, తండ్రి వయసున్న చంద్రబాబుపై తన కుమారుడు జగన్ వ్యవహరిస్తున్న తీరు పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారని మాగంటి బాబు వెల్లడించారు. జగన్ కు మంచి చెడులు చెప్పాలని తనకు వైఎస్ సూచించారని వివరించారు. ఇక, తండ్రి ఎన్టీఆర్, భర్త చంద్రబాబు సీఎంలుగా పనిచేసిన సమయంలో ఏనాడూ ఇల్లు దాటి బయటకు రాని నారా భువనేశ్వరి ఇవాళ ప్రజల్లోకి రావాల్సి వచ్చిందని, 'నిజం గెలవాలి' కార్యక్రమం కోసం ప్రజల్లోకి వచ్చిన ఆమెకు అందరూ మద్దతుగా నిలవాలని మాగంటి బాబు పిలుపునిచ్చారు.

## దమ్ముంటే ఆధారాలు బయట పెట్టండి

-మొదటి పేజి తరువాయి

చంద్రబాబు జైలులోనే చనిపోతారంటూ వైసీపీ నేతలు చెబుతున్నారని లోకేశ్ గుర్తుచేశారు. కేసులతో ఎలాంటి సంబంధంలేని నా తల్లిని కూడా జైలుకు పంపిస్తామని బెదిరిస్తున్నారని చెప్పారు. స్కాంలతో తమకు కానీ, తమ పార్టీ నేతలకు కానీ, బంధుమిత్రులకు కానీ ఎలాంటి సంబంధంలేదని లోకేశ్ స్పష్టం చేశారు. ఒకవేళ ఉందని మీ దగ్గర ఏ చిన్న ఆధారం ఉన్నా ప్రజల ముందు పెట్టాలని వైసీపీ నేతలకు లోకేశ్ బహిరంగ సవాల్ విసిరారు. వ్యవస్థలను మేనేజ్ చేసి చంద్రబాబును జైలులో పెట్టారని లోకేశ్ విమర్శించారు. ప్రజల నుంచి ఆయనను దూరం చేయడానికి, ప్రజా సమస్యలపై పోరాడకుండా అడ్డుకోవడానికి వైసీపీ ప్రభుత్వం ఈ నాటకం ఆడుతోందని ఆరోపించారు. అంతే తప్ప చంద్రబాబు ఏ తప్పూ చేయలేదని లోకేశ్ తెలిపారు. టీడీపీ అధినేతను జైలులోకి పంపడంపై పెట్టిన శ్రద్ధను రాష్ట్రంలోని రైతుల సమస్యలను పరిష్కరించడంలో పెడితే బాగుండేదని అన్నారు. సౌత్ ఇండియాలోనే ఎన్ ఎస్ జీ ప్రొటెక్షన్ కలిగిన ఒకేఒక నేత చంద్రబాబు అని, ఆయనకు మావోయిస్టుల నుంచి ప్రాణహాని ఉండడంతో కేంద్రం ఈ రక్షణ కల్పించిందని చెప్పారు. అలాంటి వ్యక్తిని అన్యాయంగా జైలులో పెట్టి, సరైన రక్షణ కల్పించకపోవడం చూస్తుంటే తమకు అనుమానంగా ఉందన్నారు. తమ అధినేతను జైలులోనే అంతమొందించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందేమోనని లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు.

## సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి పల్లా రామాంజనేయులును ఘనంగా సన్మానించిన ప్రజలు



గుంతకల్ టౌన్ అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ): స్థానిక అంబేద్కర్ నగర్ సచివాలయ పరిధిలోగల 4వార్డ్ సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి విధులు నిర్వహిస్తున్న పల్లా రామాంజనేయులు లను గుంతకల్లు పట్టణ 4 వార్డు ప్రజలు శనివారం ఘనంగా సన్మానించారు. వివిధ సంక్షేమ పథకాలకు అర్హత కలిగిన వారికి ఆటో కార్మికులు నాయి బ్రాహ్మణులు, రజకులు , ధర్జీ వృత్తిదారులు వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి వీరి కష్టాలను పాదయాత్రలో భాగంగా చూసి ప్రత్యేక వీరికి 10000 చేదోడు అనే పథకం ద్వారా అందిస్తానని మాట ఇచ్చారు. మాట ప్రకారంగానే వీరికి చేదోడు పథకం ద్వారా లబ్ధి చేకూరింది. పూర్తి సహాయ సహకారాలు అందించి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేసిన వెల్ఫేర్ కార్యదర్శి పూర్తి సహాయ సహకారాలు అందించిన పల్లా రామాంజనేయులు లను అంబేద్కర్ నగర్ లో ఉన్నటువంటి లబ్ధిదారులు అంబేద్కర్ నగర్ సచివాలయ 4 వార్డ్ కౌన్సిలర్ జింకల సుజాత చేతుల మీదగా ఘనంగా సన్మానం చేశారు. ఆటో కార్మికులు, టైలర్స్, నాయి బ్రాహ్మణులు, మాట్లాడుతూ మాకు ఈ పథకాల ద్వారా మా కుటుంబానికి ఆర్థికంగా సహకరించినందుకు గుంతకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి , మున్సిపల్ కమిషనర్ కు మున్సిపల్ చైర్పర్సన్ ఎన్ భవాని,వైస్ చైర్పర్సన్ నైరుతి రెడ్డి, మైమన్ , మున్నా, వార్డ్ కౌన్సిలర్ జింకల సుజాత వార్డు ఇంచార్జ్ జింకల రామాంజినేయ్ను కి సచివాలయ సిబ్బంది కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు . ఈ కార్యక్రమంలో 4వార్డ్ వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## ఘనంగా వాల్మీకి జయంతి



అనంతపురం బ్యూరో అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ): అనంతపురం నగరంలో భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర ఆధ్వర్యంలో ఆది కవి, రామాయణ రచయిత వాల్మీకి మహర్షి జయంతి పురస్కరించుకొని శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షివిగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకుడు మంజునాథ్ నాయుడు యువ మోర్చా నాయకుడు అజేష్ యాదవ్, తోటసూర్య బిజెపి నాయకులు పెద్దన్న,సోమయ్య, ప్రభుకుమార్,మాలోబులు, దిలీప్ 'రాజా 'గంగాధర్, తదితరులు పాల్గొన్నారు

## వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి విగ్రహం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



అనంతపురం బ్యూరో అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ) : అనంతపురం నగరంలో కె.ఎస్.ఎన్ డిగ్రీ కాలేజీలో మహర్షి వాల్మీకి రాష్ట్రస్థాయి జయంతోత్సవము కార్యక్రమంలో పాల్గొని వాల్మీకి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శాలను బోధించే మధుర కావ్యం రామాయణం. అటువంటి గొప్ప కావ్యాన్ని రచించిన ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జయంతి నేడు... ఆ రామాయణం స్ఫూర్తితో ప్రతిఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని ఆకాంక్షిస్తూ వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా వాల్మీకి విగ్రహనికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన అనంతరం జిల్లా ప్రజలందరికీ శ్రీ వాల్మీకి మహర్షి జయంతి శుభాకాంక్షలు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర బోయ కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర , జడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ , అనంతపురం వైసీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహాయ్య , ఏ.డి.సి.సి బ్యాంక్ చైర్మన్ లిఖిత, రాప్తాడు నియోజకవర్గం మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ - ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమీలమ్మకు ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



రాప్తాడు అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ ) : రాప్తాడు నియోజకవర్గం వైసీపీ సీనియర్ నాయకుడు వేపకుంట రాజన్న సతీమణి వేపకుంట ప్రమీలమ్మ అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వేపకుంట ప్రమీలమ్మ భౌతికాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

## 50 దాటిన పోలీసులకు రిటైర్మెంట్

పోలీసుల రిటైర్మెంట్ విషయంలో యూపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 50 ఏళ్లు దాటిన పోలీసుల నిర్బంధ పదవీ విరమణ కోసం స్క్రీనింగ్‌కు సంబంధించి ఉత్తర్వులు వెలువడ్డాయి. 50 ఏళ్లు నిండిన పోలీసుల ట్రాక్ రికార్డును పరిశీలించి, తప్పనిసరి పదవీ విరమణ చేయనున్నట్లు అందులో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పోలీసుల జాబితాను నవంబర్ 30లోగా ఇవ్వాలని సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2023, మార్చి 31 నాటికి 50 ఏళు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న సిబ్బందికి తప్పనిసరిగా పదవీ విరమణ కోసం స్క్రీనింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం తన ఆదేశాలలో పేర్కొంది. 50 ఏళ్లు పైబడిన పోలీసుల ట్రాక్ రికార్డును పరిశీలించిన తర్వాత, నిర్ణీత తేదీలోగా నిర్బంధ పదవీ విరమణ చేయాల్సిన పోలీసుల జాబితాను అధికారులు ప్రధాన కార్యాలయానికి పంపించనున్నారు. తమ సర్వీసులో అవినీతికి పాల్పడినట్లు లేదా చెడు ప్రవర్తన ఉన్నట్లు తేలితే అతనిని రిటైర్ చేయనున్నారు. పోలీసుల స్క్రీనింగ్‌లో వారి వార్షిక కాన్ఫిడెన్షియల్ రిపోర్టును పరిశీలించనున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను మెరుగుపరిచే లక్ష్యంతో యోగి ప్రభుత్వం పనిచేస్తోంది. కొన్ని రోజుల క్రితం పోలీసుశాఖలో నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం లేని అధికారులు, ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో సమర్థవంతులైన వారికి బాధ్యతలు అప్పగించాలని సీఎం యోగి ఆదేశించారు.

## ఆవు పేడ కిలో రెండు రూపాయలకు కొంటాం

**జైపూర్:** రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లాత్ అయిదు గ్యారెంటీలను ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛను విధానం అమలు, గోధన పథకం కింద ఆవుపేడను కిలో రెండు రూపాయల చొప్పున కొనుగోలు, కాలేజీ విద్యార్థులకు ల్యాప్‌టాప్ లేదా టాబ్లెట్ పీసీ పంపిణీ ఇందులో ఉన్నాయి. నవంబర్ 25వ తేదీన అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో తమ పార్టీని మళ్లీ గెలిపిస్తే వీటిని నెరవేరుస్తామని ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో హామీ ఇచ్చారు. త్వరలోనే పార్టీ మేనిఫెస్టోను విడుదల చేస్తామన్నారు.

# విశ్వ మానవాళికి వాల్మీకి మహర్షి మార్గదర్శకుడు







**జ్ఞాన నిధిని ప్రపంచానికి చాటిన ఆదికవి**

**కృషి పట్టదులతో మహర్షిగా ఎదిగిన మహనీయుడు**

రాయదుర్గం అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ). విశ్వ మానవాళికి జ్ఞాన నిధిని మానవ మనుగడ కొరకు సుందర రామాయణ మహా కావ్యం ద్వారా శ్రీరాముని దివ్య చరిత్ర ను లిఖించి జగతికి అందించిన ఆదికవి వాల్మీకి మహర్షి నేనని ఆయన అందరికీ ఆదర్శప్రాయుడిని ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని రాయదుర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీకి మహర్షి జన్మదినాన్ని పురస్కరించుకొని రాయదుర్గం పట్టణంలోను, పై తోట లో జరిగిన వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొని వాల్మీకి మహర్షికి ఘనంగా నివాళులు అర్పించారు. పై తోటలో జరిగిన వాల్మీకి విగ్రహ ప్రతిష్ట లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు మహా పురుషులవుతారని వాల్మీకి మహర్షి నిరూపించారన్నారు. కృషి ,పట్టుదల, చిత్తశుద్ధితో సాధన చేసి తొందర రామాయణ కావ్యాన్ని రచించి సాధారణ మానవుడిగా ఉన్న ఆయన మహర్షిగా ఎదిగారన్నారు. ఆదికవి వాల్మీకి మహర్షి దివ్య పురుషుడని, సమాజానికి మూల పురుషుడు, సంస్కృత సాహిత్యంలో రామా యణ ఇత్యాసాన్ని రచించి సమాజానికి ఆదర్శప్రాయుడిగా ఎదిగిపూజలందుకుంటున్నారు. వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేరిచేందుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం జరిగింది అన్నారు. సంకీర్ణ ప్రభుత్వంలో తెలుగుదేశం ,బిజెపి పార్టీ లు ఉండి కూడా వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చలేకపోయాయన్నారు. వాల్మీకి అయినా కాలవ శ్రీనివాసులు మంత్రిగా ఉన్న సమయంలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడంలో విఫలమయ్యాడని వాల్మీకులు తనతో పాటు ఎదిగితే తన ఉనికిని కోల్పోతానని గ్రహించి వాల్మీకుల ఎదుగుదలకు అడ్డుగా ఉన్నారన్నారు. ఎంతోమంది వాల్మీకులను అణగదొక్కుతున్నాడని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం లోనే వాల్మీకులకు పెద్దపీట వేశామని వాల్మీకి జయంతిని అధికారికంగా చేసుకోవడం జరుగుతోందన్నారు. వాల్మీకి సంక్షేమమే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని ఆయన అన్నారు.

# అర్హులైన అందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలి.

**అనంతపురం మండల సర్వసభ్య సమావేశంలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి**

**ఆత్మకూరు మండలం వద్దుపల్లి గ్రామంలో డిజిటల్ లైబ్రరీని ప్రారంభించిన ఎమ్మెల్యే**

**గత ప్రభుత్వంలో దోపిడీ జరిగింది..!**

**గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి**



అనంతపురం బ్యూరో అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ) అనంతపురం రూరల్ మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలు మంజూరు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆదేశించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అజెండాలోని వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ 90 రోజుల కార్యక్రమం కింద వచ్చిన ఇంటి పట్టా దరఖాస్తులను రెవిన్యూ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి వెంటనే మంజూరు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో దెబ్బతిన్న కరెంటు స్తంభాలను మార్పు చేసిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా చాలా గ్రామాల్లో రోడ్లు డ్రైనేజీల ఏర్పాటు చేస్తున్నామన్నారు. అవసరాల మేరకు ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు.

అందుబాటులో ఉన్న నిధులను దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి పనులు చేపట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

డిజిటల్ లైబ్రరీని ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆత్మకూరు మండలం వద్దుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన డిజిటల్ లైబ్రరీని జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మతో కలిసి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి శనివారం మధ్యాహ్నం ప్రారంభించారు.

గత ప్రభుత్వంలో దోపిడీ జరిగింది..!

గత ప్రభుత్వంలో ప్రజాధనం దోపిడీ జరిగింది' అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు.

వద్దుపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మతో కలిసి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగిన ఎమ్మెల్యే ప్రభుత్వం వల్ల కల్గిన లబ్ధి ఎమేరకు జరిగిందో వివరించారు. ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధి పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. అలాగే స్థానిక సమస్యలను తెలుసుకుంటూ వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలకు మేలు జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. సాయం చేసిన ముఖ్యమంత్రిని ఎవరూ మర్చిపోవద్దని మరోమారు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, చైర్మన్లు, డైరెక్టర్లు, గృహ సారథులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, స్టోర్ డీలర్లు, మండల నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్ లు, ఎమ్మార్వో, మండల అధికారులు పాల్గొన్నారు..

## భారత్‌లో ఇరాన్ జంట కష్టాలు.. ఆదుకున్న ఎస్పీ నేత!



సైకిల్ యాత్రపై భారత్‌కు వచ్చిన ఇరాన్ దంపతులను తిరిగి వారి దేశానికి తిరిగి పంపేందుకు యూపీకి చెందిన సమాజ్ వాదీ పార్టీ(ఎస్పీ) జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఆర్థిక సాయం అందించారు. ఈ ఇరాన్ దంపతులు ప్రపంచ శాంతి సందేశాన్ని ఇస్తూ, సైకిల్‌పై భారతదేశానికి వచ్చారు. సోషల్ మీడియా ప్లాట్‌పారం ఎక్స్‌లో అఖిలేష్ యాదవ్ ఈ వివరాలను తెలియజేస్తూ మానవత్వం కంటే గొప్ప మతం లేదని, సహాయానికి మించిన ఆరాధన లేదని పేర్కొన్నారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం కారణంగా ఇరాన్ నుంచి వచ్చి, మన దేశంలో చిక్కుకుపోయిన ఈ అతిథుల కోసం ఏదో ఒకటి చేయడమనేది తన అదృష్టం అని అఖిలేష్ అన్నారు. ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం కారణంగా.. ఈ జంట తిరుగు ప్రయాణపు టికెట్ రద్దయింది. వారి దగ్గర డబ్బులు కూడా లేవు. ఈ విషయాన్ని పార్టీ నేత ఒకరు అఖిలేష్ యాదవ్‌కు తెలియజేశారు. దీంతో ఈ జంటకు అఖిలేష్ సాయం అందించారు. ఈ జంటను వారి దేశానికి పంపేందుకు ఏర్పాట్లు చేశారు.

## ఆరు నియోజకవర్గాల్లో నా అభ్యర్థుల్ని నిలబెడతా

# కాంగ్రెస్‌పై జంగా రాఘవరెడ్డి ఆగ్రహం

**కాంగ్రెస్ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తే కుట్ర చేశారన్న జంగా రాఘవరెడ్డి**

**పార్టీ కోసం కష్టపడిన తనను కాదని ఇతరులకు టిక్కెట్ ఇచ్చారన్న జంగా**

**నాయిని రాజేందర్ ఒక బ్రోకర్... అసమర్థుడని విమర్శలు**

**పార్టీని, ప్రజలను మోసం చేయలేదని భద్రకాళి అమ్మవారి మీద ప్రమాణం చేద్దామా? అంటూ సవాల్**



కాంగ్రెస్ పార్టీ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన తనకు టిక్కెట్ ఇవ్వలేదని, కానీ కొత్తగా వచ్చిన వారికి ఇచ్చారని జంగా రాఘవరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నిన్న విడుదలైన జాబితాలో వరంగల్ పశ్చిమ నుంచి తనకు అవకాశం దక్కుతుందని జంగా భావించారు. కానీ ఆయనకు టిక్కెట్ రాలేదు. దీంతో శనివారం ఆయన అధిష్ఠానంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. యుద్ధానికి తాను సిద్ధంగా ఉన్నానని, ప్రజలు తనను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కొత్తగా వచ్చిన రేవూరికి, నాగరాజుకు, యశస్వికి టిక్కెట్లు ఇచ్చారని, మొదటి నుంచి పార్టీ కోసం పని చేసిన తనకు ఇవ్వలేదన్నారు. పార్టీ సమావేశాలకు కోట్ల రూపాయలు ఖర్చు చేశానన్నారు. తమ పార్టీ అధిష్ఠానం టిక్కెట్ దక్కించుకున్న నాయిని రాజేందర్ ఒక బ్రోకర్... అసమర్థుడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేయూ భూములు అమ్ముకున్న నాయినికి టిక్కెట్ ఇచ్చారన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నప్పటికీ, నాయకులు ఆ ఓటు వేయించుకోవడానికి సిద్ధంగా లేరన్నారు. తనపై కుట్ర చేసి, ఇక అసమర్థుడికి టిక్కెట్ ఇచ్చారన్నారు. తాను పార్టీని, ప్రజలను మోసం చేయలేదని భద్రకాళి అమ్మవారి మీద ప్రమాణం చేసేందుకు సిద్ధమని, అందుకు నాయిని సిద్ధమా? అని ఆయన సవాల్ చేశారు. కార్యకర్తలతో సమావేశమై, వారితో చర్చించి నిర్ణయం తీసుకుంటానన్నారు. ఆరు నియోజకవర్గాల్లో తన అభ్యర్థులను నిలబెడతామని, అవసరమైతే ఏదో ఒక పార్టీ మద్దతు తీసుకుంటానన్నారు. వరంగల్ పశ్చిమలో వినయ్ భాస్కర్‌కు, తనకు మధ్యే పోటీ అన్నారు. ఎల్లుండి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానన్నారు.

## చంద్రబాబును త్వరగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాను

**చంద్రబాబు 49 రోజులుగా జైల్లో ఉంటున్నారని పోచారం ఆవేదన**

**బెయిల్ రాకుండా చేస్తున్నారని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఆగ్రహం**

**చంద్రబాబు ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోందన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి**



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అరెస్టుపై తెలంగాణ శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి మరోసారి స్పందించారు. చంద్రబాబు అరెస్ట్‌పై ఈసారి ఆయన కాస్త ఘాటుగానే స్పందించారు. ఈ అరెస్ట్ కక్షపూరితమైన చర్య అన్నారు. చంద్రబాబు 49 రోజులుగా జైల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు బెయిల్ రాకుండా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ అధినేత ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోందన్నారు. చంద్రబా బును త్వరగా విడుదల చేయాలని తాను ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నానని స్పీకర్ పోచారం తీవ్రంగా స్పందించారు.

# ప్రగతిపొద్దు పొడిచింది ఇప్పుడేనా?

నేను అమితంగా గౌరవించే ఇద్దరు వృద్ధ భారతీయులు గత నెలలో కీర్తిశేషులు అయ్యారు. ఒకరు ముంబైలోను, మరొకరు బెంగళూరులోను మరణించారు. నూరేళ్ల సంపూర్ణ జీవితానికి చేరువవుతూ మరలి రాని సుదూర తీరాలకు సాగిపోయారు. వారిలో మొదటి వ్యక్తి ఉదయ్‌పూర్ సంస్థానంలోనూ, రెండవ వారు మద్రాస్ ప్రెసిడెన్సీలోని పట్టణాలలోను పెరిగారు. బ్రిటిష్ రాజ్ అంతిమ సంవత్సరాలలో ఆ ఇరువురూ యుక్త వయస్సుకు వచ్చారు. నవ యవ్వనంనుంచే శాస్త్ర, సాంకేతిక రంగాలలో విశేష శ్రద్ధాసక్తులు చూపారు. మొదట బ్రిటిష్ ఇండియాలోను పిదప యునైటెడ్ కింగ్‌డమ్ లోనూ ఇంజనీర్లుగా శిక్షణ పొందారు. పాశ్చాత్య దేశాలలోనే స్థిరపడి, జీవితాన్ని మరింత సంపద్వంతమూ, సౌఖ్య పూరితమూ చేసుకునే అవకాశమున్నప్పటికీ ఇరువురూ 1947లో స్వదేశానికి తిరిగి వచ్చారు. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన తమ జన్మభూమి భారత్ సర్వతోముఖ వికాసానికి తమ వంతు తోడ్పాటునందించాలన్నదే ఆ విద్యావంతుల ఆకాంక్ష. స్వదేశానికి తిరిగివచ్చిన ఆ యువ ఇంజనీర్లు, భారత్‌లో ఉన్న ?బహుళ జాతి కంపెనీలలో గానీ లేదా టాటాలు, కిర్లోస్కర్ల యాజమాన్యంలో ఉన్న ప్రైవేట్ ఇంజనీరింగ్ కంపెనీలలో కానీ చేరలేదు. అంతగా లాభప్రదం కాని (అయితే వారిదృష్టిలో విశేష గౌరవప్రదమైన) ప్రభుత్వ రంగ సంస్థలలోనే చేరారు. ఇటీవలే మరణించిన ఈ భారతీయులు ఇరువురూ పరస్పరం పూర్తిగా అపరిచితులు. వారితో నాకు పరిచయ భాగ్యమున్నది. ఒకరు మా నాన్నగారి చిన్న తమ్ముడు, మరొకరు ఒక సన్నిహిత మిత్రుని తండ్రి. ఇరువురివీ ఒకే విధమైన జీవితాలు. వృత్తి ధార్మికులు. మన మాతృభూమిగా మనం చెప్పుకుంటున్న ఈ దేశంలో ఒక మానవతా పరిపూర్ణ సమాజ నిర్మాణానికి ఆనాటి జాతి పెద్దల స్ఫూర్తితో తమ తోడ్పాటు నందించిన స్వార్థరహితులు. ఉదయ్‌పూర్ ఇంజనీర్ తన వృత్తి జీవితమంతా భారతీయ రైల్వేలలో గడిపారు. కోట్లాది భారతీయులకు రైల్వేలే ముఖ్య ప్రయాణ సాధనాలు. రైల్వేవ్యవస్థ సమర్థత, విశ్వసనీయతపైనే కొత్తగా ఆవిర్భవించిన భారత గణ తంత్ర రాజ్య సమస్త జీవితమూ ఆధారపడి ఉంది. రైల్వేల సమర్థత, విశ్వసనీయతను ఇతోధికంగా పెంపొందించేందుకు నా స్నేహితుని తండ్రి విశేష కృషి చేశారు. ముంబై–వడోదర రైలు మార్గంలో విద్యుత్ రైళ్లను ప్రవేశపెట్టడంలో ఆయన కీలకపాత్ర వహించారు. తద్వారా లక్షలాది ప్రజలు రోజూ వేగవంతంగా, సౌఖ్యంగా ప్రయాణించేందుకు ఆయన తోడ్పడ్డారు. మా నాన్నగారి చిన్న తమ్ముడు, దక్షిణాదికి చెందిన ఇంజనీర్ తన వృత్తి జీవితంలో తొలి సంవత్సరాలను భారత వాయుసేనలో గడిపారు. ఆ తరువాత హిందుస్థాన్ ఎయిరో నాటిక్స్ లిమిటెడ్‌లో వివిధ హోదాలలో పని చేశారు. రక్షణ ఉత్పత్తులలో దేశం స్వావలంబన సాధించేందుకు హెచ్ఏఎల్ ఇంజనీర్‌గా ఆయన నిర్ణయాత్మక కృషి చేశారు. తొలుత దేశీయ విమానాల రూపకల్పన, నిర్మాణ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొన్నారు. ఆ తరవాత మిగ్ 21 లాంటి విదేశీ యుద్ధ విమానాలను దేశీయంగా ఉత్పత్తి చేయడంలో కీలక పాత్ర వహించారు. ఆయన ఉత్పత్తి చేసిన యుద్ధ విమానాలు మన జాతీయ భద్రతకు విశేషంగా తోడ్పడ్డాయి. భారత ప్రజలను స్వావలంబన పథంలో వడిగా ముందుకు నడిపించాయి. మా బాబాయి నాకు గర్వకారణం. స్వదేశంలోనే నివశిస్తూ వృత్తి జీవితం లేదా విద్వత్ కృషిని ఇక్కడే నిర్వహించాలన్న నా నిబద్ధతకు స్ఫూర్తి మా బాబాయే. హెచ్ఏఎల్ నుంచి ఉద్యోగ విరమణ అనంతరం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఆయన బోధించారు. ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియాను అభివృద్ధి పరచడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. సామాజిక, మానవీయ శాస్త్రాల విద్యార్థినైన నాకు మా బాబాయి ఇంజనీరింగ్ కృషిపై అంతగా అవగాహన ఉండేది కాదు. అయితే ఆయనలో కుల పరమైన ఆభిజాత్యం, మత సంకుచితత్వం ఏ కోశానా ఉండేవి కావు. ఆయనలోని ఈ గుణం నాకు బాగా నచ్చింది. ఆయన పినతండ్రులలో ఒకరు సంఘసంస్కర్త ఆర్. గోపాలస్వామి అయ్యర్. మైసూరు సంస్థానంలో దళితుల అభ్యున్నతికి ఆయన కృషి చేశారు. గోపాలస్వామి ప్రభావం మా బాబాయిపై ఉన్నది. అలాగే భారత వాయుసేనలో ఉద్యోగ జీవితం మా బాబాయిలో మత భావాలను విశాలం చేసింది. భారతదేశ సాంస్కృతిక వైవిధ్యం పట్ల ఆయనకు అపార అవగాహన ఉండేది. ఆ వైవిధ్యాన్ని ఆయన అమితంగా గౌరవించేవారు. మంగళూరులో పెరిగిన బాలుడు తన మొదటి డిగ్రీని బెనారస్‌లో తీసుకున్నాడు. ఉద్యోగ జీవితం తుదినాళ్లలో ఒడిషాలోని ఒక గిరిజన ప్రాంతంలో గల హెచ్ఏఎల్ ఫ్యాక్టరీలో మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉండేవారు. నా పరిశోధనల నిమిత్తం నేను ఆ గిరిజన ప్రాంతానికి వెళ్లినప్పుడు అక్కడ ప్రతి ఒక్కరూ మా బాబాయి గురించి అత్యంత గౌరవంగా మాట్లాడడాన్ని గమనించాను. ఉదయ్‌పూర్ ఇంజినీర్‌తో నాకు స్వల్ప పరిచయం మాత్రమే ఉన్నది. అయితే ఆయన కూడా భారతదేశంపై విశాల దృక్పథంతో ఉండేవారు. ఎటువంటి సంకుచితత్వాలూ ఆయనలో ఉండేవి కావు. లలితకళలు, చేతి వృత్తులకు ప్రాధాన్యమిచ్చిన విద్యాభవన్ అనే ప్రగతిశీల పాఠశాలలో ఆయన చదువుకున్నారు. రైల్వేలలో చేరడం ద్వారా ఆయన సామాజిక అవగాహనలు విశాలమూ ప్రగాఢమూ అయ్యాయి. భారత ప్రజలలోని అపార వైవిధ్యం సాయుధ బలగాలలో కంటే భారతీయ రైల్వేల సిబ్బందిలోనే ఎక్కువగా ప్రతిబింబించేది. రాజస్థాన్‌కు సాంస్కృతికంగా, భౌగోళికంగా చాలా దూరంలో ఉన్న ప్రాంతాలలోనే ఈ ఇంజనీర్ జీవితం గడిచింది. ఈ ఇంజినీర్లు ఇరువురూ తమ వృత్తి ధర్మ నిర్వహణలో ప్రజలకు ఇతోధిక మేలు చేశారు. వ్యక్తిగత జీవితాలలోనూ వారు ఆదర్శ ప్రాయులే. తండ్రిగా, భర్తగా తమ బాధ్యతలను ఇరువురూ విశాల భావాలతో నిర్వహించారు. తోబుట్టువుల శ్రేయస్సును కాంక్షించారు. సహచరుల, స్నేహితుల సంక్షేమంపై శ్రద్ధ చూపారు. ఇరువురూ ఎటువంటి పురుష దురహంకార వైఖరులు లేని విశాలహృదయులు. మా బాబాయి చనిపోయినప్పుడు ఆయనతో నలభై ఏళ్ల పరిచయమున్న నా సతీమణి, గాంధీ గురించి జార్జి ఆర్వెల్ అన్న మాటలను గుర్తు చేసుకున్నారు 'మహాత్ముడు స్వచ్ఛమైన మానవతా పరిమళాలను వెనుక వదిలివెళ్ళారు' అని ఆర్వెల్ వ్యాఖ్యానించాడు. నా స్నేహితుని తండ్రి విషయంలో కూడా ఇది పూర్తిగా వర్తిస్తుంది. ఇంతకూ ఈ ఉదాత్త వ్యక్తులు ఎవరో నేను చెప్పలేదు కదూ! ఆ విషయానికే వస్తున్నాను. కర్ణాటకకు చెందిన ఇంజినీర్ సుబ్రమణియమ్ చెన్నకేశుబీ రాజస్థాన్ ఇంజినీర్ పేరు శ్రీగోపాల్ త్రివేది. స్నేహితులు, కుటుంబమూ, సహచరులూ ఆ ఇరువురినీ ఎంతగానో అభిమానించేవారు. ఎన్నో మధుర స్మృతులను వారు దాచుకున్నారు. ఇరువురి జీవితాలూ అర్థవంతమైనవి. ఇరువురూ నిజమైన జాతి నిర్మాతలు. మన చారిత్రక గతాన్ని గురించిన వర్తమాన దృక్పథాలు వారిని అలా గౌరవించడానికి ఒప్పుకోక పోవడం ఎంతైనా శోచనీయం. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల తన ప్రసంగాలలో, గత ఎనిమిది–తొమ్మిది సంవత్సరాలలో, అంటే తాను ప్రధానమంత్రిగా వచ్చిన తరువాత, జాతి సాధించిన పురోగతి గురించి పదే పదే ప్రస్తావిస్తున్నారు. అటల్ బిహారీ వాజపేయి నేతృత్వంలోని గత ఎన్‌డిఏ ప్రభుత్వం నిర్వహించిన నిర్మాణాత్మక కృషి (మౌలిక సదుపాయాల రంగం ఇందుకొక ఉదాహరణ)ని సైతం మోదీ అంగీకరించకపోవడం విస్మయం కలిగిస్తోంది. తన పర్యవేక్షణలో జాతి 'ప్రగతి' గురించిన మోదీ బడాయి మాటలను ఆయన కేబినెట్ మంత్రులు, అధికార పార్టీ సామాజిక మాధ్యమాల విభాగం వారు మరింతగా విపులీకరిస్తారు. వాటిని విన్న లేదా చదివిన ఆలోచనాపరులకు మే 2014కు పూర్వం ఆర్థిక, సాంకేతికతా వెనుకబాటుతనంలో భారత్ కునారిల్లిపోయిందా ఏమిటి అన్న విస్మయకర సందేహం తప్పకుండా వస్తుంది. జాతి జాగృతి గురించి ఒక ప్రత్యామ్నాయ కథనం కచ్చితంగా ఉంది. మే 2014కి చాలా సంవత్సరాల పూర్వమే ఆ పురోగతి ప్రారంభమయిందని ఈ భిన్న చరిత్ర నొక్కి చెప్పుతుంది. 1991 వేసవి అనంతరమే భారత్ అభివృద్ధి బాటలోకి ప్రవేశించి వడివడిగా ముందుకు సాగి ఆర్థికాభివృద్ధి శిఖరాలను అధిరోహించించిందన్నదే ఆ ప్రత్యామ్నాయ కథనం. సరళీకృత ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టిన తరువాతనే భారత్ ఒక ఆర్థిక శక్తిగా ప్రభవించిందని స్వేచ్ఛావిపణివాదులు విశ్వసిస్తున్నారు. నరేంద్ర మోదీ ఆత్మస్తుతి కథనాల కంటే స్వేచ్ఛా విపణివాదుల కథనాలలో కొంత సత్యం లేక పోలేదు. అయితే ఇవి కూడా స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచీ పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా, మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రి వచ్చే దాకా గడచిన 44 సంవత్సరాల కాలంలో దేశ సర్వోముఖాభివృద్ధికి భారత ప్రజల సంక్షేమానికి విశేష కృషి చేసిన ఉదాత్త భారతీయులను చులకన చేస్తున్నాయి, అగౌరవపరుస్తున్నాయి. 1947లో భారత్ ఏమిటి? ఒక నిరుపేద దేశం. మతతత్వ కల్లోలాలతో కొట్టుమిట్టాడుతున్న సమాజం. ప్రజలు చాల వరకు నిరక్షరాస్యులు. ఈ స్వతస్సిద్ధ బలహీనతలు, వైరుధ్యాలతో భారత్ ఒక ప్రజాస్వామిక దేశంగా ఎంతోకాలం మనలేదని ఇంటా బయటా ఎంతో మంది విశ్వసించేవారు.

# సూర్యకాంతం పాత్రలు సజీవ శిల్పాలు

గయ్యాళి పాత్రలు అనగానే తెలుగు ప్రేక్షకులకు ఠక్కున గుర్తుకువచ్చే పేరు సూర్యకాంతం. ఓర చూపులు చూస్తూ, ఎడంచెయ్యి విసుర్తూ కుడిచెయ్యి నడుం మీద నిలబెట్టి ఆమె చెప్పిన సంభాషణా చాతుర్యం, అంతలోనే వెక్కిరిస్తూ, అంతలోనే కల్లబొల్లి కబుర్లతో, వెక్కి వెక్కి వెక్కి ఏడుస్తూ వెండి తెరపై విభిన్న పాత్రల కు జీవం పొందింది ఎవరూ అంటే అది పాటతరం సహజ నటి సూర్యకాంతం అని వేరే చెప్పనక్కర లేదు. సూర్యకాంతాన్ని హాస్య నటీమణిగా ముద్ర వెయ్యడానికి లేదు. ఆమె ప్రత్యేకంగా హాస్యం చెయ్యక పోయినా ఆమె సంభాషణ చెప్పే తీరు, నవ్వు తెప్పిస్తుంది, చేసే చేష్టలు కోపం తెప్పిస్తాయి. అలా అని ఆమె దుష్టపాత్రధారిణి అని కూడా అనలేం. సహాయ నటి అనే అనాలి. తెలుగు సినిమాల్లో గయ్యాళి పాత్రల్లో తన సహజ నటనతో ఆమె ప్రాచుర్యం పొందింది. గయ్యాళి అత్తకి మారుపేరు సూర్యకాంతం అనిపించుకుంది. ఆమె ధరించిన అత్త పాత్రలు సజీవ శిల్పాలు. సహజ నట కళా శిరోమణి, హాస్య నట శిరోమణి, బహుముఖ నటనా ప్రవీణా, రంగస్థల శిరోమణి సూర్యకాంతం తూర్పు గోదావరి జిల్లా కాకినాడ దగ్గరున్న వెంకట కృష్ణరాయ పురంలో 1924 అక్టోబర్ 28న తన తల్లితండ్రులకు 14వ సంతానంగా జన్మించింది. ఆరేళ్ళ చిన్న వయసు లోనే పాడటం, నాట్యమాడటం నేర్చుకొంది. పెరిగే వయసులో హిందీ సినిమా పోస్టర్లు బాగా ఆకర్షించాయి.

సినిమాల్లో నటించాలనే కోరిక ఆపుకోలేక చెన్నై చేరుకొంది. మొదట జెమిని స్టూడియో నిర్మించిన చంద్రలేఖ సినిమాలో డాన్సర్ గా అవకాశం వచ్చింది. అప్పట్లో నెలకు 65 రూ. జీతం ఇవ్వబోతే నిర్మాతతో తన అసంతృప్తిని తెలియ బరచిన మీదట 75 రూపాయలు చేశారు. తరువాత ధర్మాంగద (1949)లో ఆమెది మూగవేషం. ధర్మాంగద టైములో చిన్నా చితకా వేషాలు వేసినా తరువాత లీలా కుమారి సాయంతో మొదటిసారిగా నారద నారది సినిమాలో సహాయ నటిగా అవకాశం వచ్చింది. చిన్న చిన్న పాత్రలు నచ్చక జెమినీ స్టూడియో నుంచి బయటకు వచ్చేసింది. మనసులో బొంబాయికి వెళదామని ఉన్నా అందుకు ఆర్థిక స్తోమత సరిపోక ఆ ఆలోచనను విరమించుకొంది. ఆ పరిస్థితిలో సహాయ నటిగా గృహప్రవేశం సినిమాలో మంచి అవకాశం వచ్చింది. తరువాత తన కల అయిన హీరోయిన్ వేషం సౌదామిని చిత్రం ద్వారా వచ్చింది. కానీ ఆ సమయంలో కారు ప్రమాదం జరిగి ముఖానికి గాయం అవడంతో ఆ అవకాశం తప్పి పోయింది. బాగైన తరువాత సంసారం



చిత్రంలో మొట్టమొదటి సారిగా గయ్యాళి అత్త పాత్ర వచ్చింది. తరువాత తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా తెలుగు సినీ అభిమానుల గుండెల్లో నిలిపోయేలా జీవితాంతం అవే పాత్రలలో నటించింది. అసలు సంసారం చిత్రం తరువాత బొంబాయికి చెందిన ఒక నిర్మాత ద్వారా హీరోయిన్ గా అవకాశం వచ్చింది.

కానీ తనకు అవకాశం రాక ముందే ఇంకొక హీరోయిన్ ను పెట్టుకొని తీశేసారని తెలియడంతో, "ఒకరి బాధను నా సంతోషంగా తీసుకోలేను" అని ఆ సినిమాను నిరాకరించింది. కోడరికం సినిమా ఆమెకు ఎంతో పేరు తీసుకొచ్చింది. బి.నాగిరెడ్డి, చక్రపాణిలు ఆమె లేకుండా సినిమాలు తీసేవారు కారు. హైకోర్టు జడ్జి పెద్దిబొట్ల చలపతిరావు ను 1950లో వివాహ మాడారు. ఆ రోజుల్లోని అనేక సాంఘిక చిత్రాల్లో రేలంగి – సూర్యకాంతం, రమణారెడ్డి – సూర్యకాంతం, ఎస్.వి.రంగారావు – సూర్యకాంతం– జంటలు, వాళ్ల దృశ్యాలు గుర్తుకు తెచ్చుకుని ఇవాళ కూడా హాయిగా నవ్వుకోవడం కద్దు. కొత్త సినిమా వస్తూంటే అందులో సూర్యకాంతం వుందా? అని ప్రేక్షకులూ, తారా గణంలో సూర్యకాంతం వున్నట్టేగదా? అని సినిమా డిస్ట్రిబ్యూటర్లూ – ఎదురు చూసేవారు. చక్రపాణి (1954), దొంగరాముడు (1955), చిరంజీవులు (1956), తోడికోడళ్లు (1957), అత్తా ఒకింటి కోడలే (1958), ఇల్లరికం (1959), భార్యాభర్తలు (1961), గుండమ్మ కథ (1962), కులగోత్రాలు (1962), దాగుడు మూతలు (1964), అత్తగారు–కొత్తకోడలు, మూహూర్తబలం (1969) లాంటి మరపురాని ఎన్నో సినిమాలలో నటించింది. నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు ఒకసారి టెలివిజన్ ఇంటర్వ్యూలో..."నువ్వు తెలుగు భాషకు చేసిన అన్యాయం ఒకటుంది.

'సూర్యకాంతం' అనే చక్కని పేరు ఇంకెవరూ పెట్టుకోకుండా చేశావు" అని ఆమెతో చమత్కారంగా అన్నానని చెప్పాడు. వ్యక్తిగా సూర్యకాంతం గయ్యాళి కానేకాదు – మామూలు మనిషే. ఏ సమావేశాలకో, సినిమా ఉత్సవాలకో ఆమె వెళ్లినప్పుడు ఆటోగ్రాఫుల కోసం వెళ్లే స్త్రీలు సూర్యకాంతం దగ్గరకి వెళ్లడానికి భయపడేవారు. ఐతే ఆమె నికార్సయిన మనిషి, కచ్చితమైన మనిషి, సహృదయం గల మనిషి, సహాయపడే మనిషి. ఆమె శుభ్రంగా కడుపునిండా తినేది, పదిమందికీ పెట్టేది. షూటింగ్‌కి వచ్చినప్పుడల్లా – తనతో ఏవో తినుబండారాలు తీసుకు రావడం, అందరికీ పెట్టడం అలవాటు. ఇలాంటి అలవాటు సావిత్రి, కృష్ణకుమారి, జానకి వంటి నటీ మణులకీ వుండేది. షూటింగుల్లో జోకులు చెప్పడం, సూర్యకాంతం సరదాల్లో ఒకటి. ఓ సినిమాలో నాగయ్యను నానా మాటలూ అని, నోటి కొచ్చిన తిట్లు తిట్టాలి. షాట్ అయిపోయాక ఆయన కాళ్లమీద పడి 'అపరాధం – క్షమించండి!' అని వేడుకుంది. 'పాత్ర తిట్టిందమ్మా, నువ్వెందుకు బాధపడతావూ? లే!–' అని నాగయ్య లేవనెత్తితే, కన్నీళ్లు తుడుచుకున్న భక్తీ, సెంటిమెంటూ ఆమెవి. దబాయింపూ, కచ్చితత్వమూ ఉన్న మనిషే అయినా, మనసు మాత్రం వెన్న, సున్నితం. అవసరమైన వాళ్లకి ఆర్థిక సహాయం చేసేదిగాని అనవసరం అనిపిస్తే మాత్రం 'పూచికపుల్ల' కూడా విదిలించేది కాదు. మొహమాట పడకుండా తనకి రావాల్సిన పారితోషకాన్ని అడగవలసిన నిర్మాతల్ని గట్టిగా అడిగేది. ఆమె అందర్నీ నమ్మేది కాదు. తన కారు రిపేరుకొస్తే ఎంత పెద్ద రిపేరైనా, మెకానిక్ ఇంటికొచ్చి తన కళ్లముందు చెయ్యవలసిందే – ఎంత 'ఎక్స్‌ట్రా మనీ' అయినా తీసుకోనీ గాక. చివరి దశలో వేషాలు తగ్గిపోయినా, చివరి దాకా నటిస్తూ ఉండాలనే కోరుకునేది. తన ఆరోగ్యం బాగులేకపోయినా, 'నటిస్తాను' అని ధైర్యంగా చెప్పేది.

# అబ్బుర పరుస్తున్న ఆనిమేషన్ కళ

మనకు సుపరిచితమైన స్పైడర్ మాన్, మిక్కీ మౌస్, డొనాల్డ్ డక్, టామ్ అండ్ జెర్రీ, ఫిలిమ్ అవతార్, బాహుబలి సినిమా, ఆనిమేషన్ చిత్రాలు లాంటి పాత్రల ప్రభావం మన మనసుల్లో సుస్థిరంగా నాటుకున్నాయి. షార్ట్ వాణిజ్య ప్రకటనలతో మొదలు పూర్తి నిడివిగల చలన చిత్రాల వరకు ఆనిమేషన్ కళకు సృజన జోడించి



వినియోగించే స్థాయికి టెక్నాలజీ చేరడం సంతోషదాయకం. సమాజ శ్రేయస్సు కోరే పలు అంశాలను ఆనిమేషన్ కళలో ప్రత్యేకతలుగా, సరళంగా, స్పష్టంగా, అర్థవంతంగా, ఆకర్షణీయంగా తక్కువ సమయంలో గొప్ప భావాలను వ్యక్తం చేయవచ్చు. 28 అక్టోబర్ 1892లో తొలి సారి పారిస్‌లో ఆనిమేషన్ చిత్రం ప్రదర్శించడం జరిగింది. దీనికి గుర్తుగా ఆనిమేషన్ కళకు పెరిగిన అపార ఆదరణను దృష్టిలో ఉంచుకొని వాణిజ్య, చలనచిత్రరంగాల్లో దాని ప్రాముఖ్యతను వివరించే సదుద్దేశ్యంతో "ఇంటర్నేషనల్ ఆనిమేటెడ్ ఫిలిమ్ అసోసియేషన్" నేతృత్వంలో 2002 నుండి ప్రతియేటా 28 అక్టోబర్ రోజున 'అంతర్జాతీయ ఆనిమేషన్ దినోత్సవం(ఇంటర్నేషనల్ ఆనిమేషన్ డే)' పాటించుట జరుగుచున్నది. ఆనిమేషన్ కళకు సృజనను జోడించి నూతనత్వాన్ని ఆపాదించడం, ఆనిమేషన్ కళ వైపుకు యువతను ఆకర్షించడం, ఆనిమేషన్‌లో వినూత్న భావాలను జోడించడం, ఆనిమేషన్ ఆర్ట్ గూర్చి కార్యశాలలు నిర్వహించడం, ప్రఖ్యాత ఆనిమేషన్ ఫిలిమ్‌లను ప్రదర్శించడం, ఆనిమేషన్ కళ వెనుక దాగిన వైజ్ఞానికశాస్త్రాన్ని వివరించడం, ఆనిమేషన్ కళలో నిష్ణాతులను సన్మానించడం లాంటి అంశాలను చర్చించేందుకు అంతర్జాతీయ ఆనిమేషన్ దినోత్సవ వేదికలను వినియోగించుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ఆనిమేషన్ ప్రక్రియకు విద్య, వినోదం, వాణిజ్యం, మార్కెటింగ్, శాస్త్రీయ అవగాహన, సృజనశీల కళ, గేమింగ్, సిమ్యులేషన్, సినిమా, షార్ట్ ఫిల్మ్, మెడికల్, రిటైల్, ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ లాంటి రంగాల్లో అనంతమైన అవకాశాలు, ప్రయోజనాలు ఉన్నాయి. నిజ జీవితాన్ని నకలు చేస్తూ బొమ్మల కదలికలతో చిత్రాలు తీయడాన్ని ఆనిమేషన్ నైపుణ్య కళ అంటారు. వాస్తవికతకు ఊహను జోడించి అందరికీ అర్థం అయ్యేలా సరళ, వినోదాత్మక చిత్రాల ద్వారా సందేశాన్ని ఇవ్వడం ఆనిమేషన్ ప్రత్యేకత. స్వల్ప వ్యవధిలో అధిక ప్రభావం చూపగల సామర్థ్యం ఆనిమేషన్ కళకు ఉంటుంది. ఆనిమేషన్‌లో సంప్రదాయ, 2డి, 3డి, మోషన్ గ్రాఫిక్స్, స్టాప్ మోషన్, కటౌట్ అండ్ కల్లాజ్, రోటోస్కోపింగ్, సెల్ ఆనిమేషన్ మొదలగు రకాలు ఉన్నాయి. సాధారణ జనాలతో కాకుండా వ్యాపారవర్గాలలో కూడా ఆనిమేషన్ కళ ప్రధాన భూమికను నిర్వహిస్తున్నది. డిజిటల్ విప్లవం, అంతర్జాల ప్రభంజనం నేపథ్యంలో ఆనిమేషన్ కళకు అపార ఆదరణ లభించింది. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, ముఖ్యంగా సినిమాలు, టివీల్లో ఆనిమేషన్ కళ ప్రవేశంతో ఆ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. అన్ని వర్గాల, వయసుల ప్రజలను ఆనిమేషన్ కళ ఆకర్షిస్తున్నది. ఆనిమేషన్ వీడియోలతో సందేశాలను సులభంగా ఇవ్వడం, ఊహాత్మక పరిధికి అవధులు లేక పోవడంతో సృజనశీలత పెరగడం, వైద్యరంగంలో వినియోగపడడం, ఆకర్షనీయంగా ఉండడం, సులభంగా అవగాహనకు రావడం, వాణిజ్య ప్రకటనలతో ఆకర్షించడం, తేలికగా వేగంగా ప్రజలకు చేరడం, కంటికి ఇంపైన రంగుల చిత్రాలు తీయగలగడం లాంటి ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. 1906లో స్టువార్ట్ బ్లాక్టన్ మొదటి ఆనిమేషన్ చిత్రం 'హ్యూమరస్ ఫేజెస్ ఆఫ్ ఫన్నీ ఫేసెస్' తీయడం జరిగింది. 1928లో వాల్ట్ డిస్నీ 'స్టీంబోట్ విల్లి' అనబడే ప్రథమ ఆనిమేటెడ్ కార్టూన్ ఫిల్మ్ తీయడం జరిగింది. 1937లో మొదటి పూర్తి నిడివిగల ఆనిమేటెడ్ 'స్నోవైట్' అనే చలనచిత్రాన్ని వాల్ట్ డిస్నీ తీశారు. 1993లో 3డి ఆనిమేషన్ సాఫ్ట్ వేర్ అందుబాటులోకి వచ్చింది. ఆధునిక యువత ఆనిమేషన్ కళ పట్ల ఆసక్తిని పెంచుకొని, ఆ రంగాన్ని తమ వృత్తిగా ఎంచుకొని, మరింత సృజనను జోడించి ప్రపంచ మానవాళికి నవ్య ఆనిమేషన్ దృశ్య రుచులను చూపుతారని ఆశిద్దాం.

# నిబద్ధతకు ప్రతిరూపం రాఘవాచారి

నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, విలువలు, నిబద్దతతో కూడిన జర్నలిజానికి మారుపేరుగా నిలిచిన పాత్రికేయులు, సంపాదకులు చక్రవర్తుల రాఘవాచారి. నిరంతరం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎనలేని సేవలు చేశారు. రాఘవాచారి స్వస్థలం వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతాపురం. 1939 సెప్టెంబరు 10న ఆయన జన్మించారు. నిబద్ధతత, విలువలతో కూడిన జర్నలిజానికి మారుపేరుగా నిలిచారు. తెలుగు పబ్లిక్ రచయితల్లో నిరుప మానమైన మేధావి చక్రవర్తుల రాఘవాచారి, తెలుగు, ఇంగ్లీష్ సంస్కృత భాషల్లో పండితులు. పాత్రికేయుడు, సీనియర్ జర్నలిస్ట్. 1972 నుండి 2005 వరకు విశాలాంధ్రలో సంపాదకుడిగా పనిచేశారు. ఆయన మూర్తీభవించిన నిజాయితీ పరుడు. ఆయన వృత్తిలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. సాంప్రదాయక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. అయిదో ఏటి నుంచి ప్రబంధాలు, ప్రాచీన కావ్యాలు రామాయణ మహా భారతాలు చదివారు. ఆయనకు ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ నేర్పడానికి ముగ్గురు ఉపాధ్యాయులను నియ మించారు. సంస్కృతం నేర్చు కోవడానికి ఆయనను ఆంధ్ర ప్రాంతంలోని పొన్నూరు పంపించారు. వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతా పురం గ్రామంలో జన్మించిన రాఘవాచారి సికింద్రాబాద్ సమీపంలోని లాలాగూడ రైల్వే పాఠశాలలో 11వ ఏట అయిదో తరగతిలో చేరారు.

1953 నుంచి విశాలాంధ్ర చదవడం ప్రారంభించారు. నిజాం కళాశాలలో పి.యు.సి.లో చేరి, ఉస్మానియా విశ్వవిద్యాలయం 6వ ర్యాంకు సాధించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీలో చేరారు. కానీ ఇంజనీరింగు రెండో సంవత్సరంలోకి వచ్చేటప్పటికి ఆయనకు చదువు మీద ఆసక్తి తగ్గింది. వరంగల్ వెళ్లి బీఎస్సీలో చేరారు. కమ్యూనిస్టు పార్టీ అనుబంధ విద్యార్థి సంఘంలో చేరారు. కళాశాల విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసి అద్భుతమైన మెజారిటీతో గెలిచారు. పట్టభద్రుడైన తరువాత హైదరాబాద్ వచ్చి న్యాయశాస్త్రం చదివారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ప్రతినిధిగా లా కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్ష స్థానానికి పోటీ చేశారు. అప్పుడు విశ్వ విద్యాలయంలో ఎం.ఎ. ఇంగ్లిష్ చదువుతున్న ఎస్. జైపాల్ రెడ్డి వంటి వారు తీవ్రమైన వ్యతిరేక ప్రచారం చేసినా రాఘవాచారి అఖండ విజయం సాధించారు. న్యాయ శాస్త్రంలో పట్ట భద్రుడైన తరువాత ఎల్.ఎల్.ఎం. చేశారు. 1969–71 మధ్య ఆయన ఢిల్లీ నుంచి వెలువడే వామపక్ష అనుకూల ఇంగ్లీష్ పత్రిక విలేకరిగా పని చేశారు. 1971లో ఆయన విజయవాడ వెళ్లి విశాలాంధ్రలో చేరారు. కొద్ది కాలానికే ఆ పత్రికకు సంపాదకుల య్యారు. 28 ఏళ్ల సుదీర్ఘ కాలం విశాలాంధ్ర సంపాదకులుగా ఉన్నారు. ఆయన సంపాదకీయాలు సూటిగా, స్పష్టంగా ఉండేవి. స్పష్టత, సంక్షిప్తత ఆయన శైలి. 'తెలుగు పత్రిక పరిణామం – ప్రయోగాలు – ప్రయోజనం' అన్న వ్యాసంలో తెలుగు పత్రికా రంగంలో వాడే భాషా ప్రామాణీకరణ జరగలేదని విచారం వ్యక్తం చేశారు. విజయ వాడ, ఇతర ప్రాంతాల.లోనూ ఉపన్యాసకుడిగా ఆయనను ఆహ్వానించే వారు. ఆయన మాటల్లో అడుగడుగునా వ్యంగ్యం తొణికిస లాడేది. ఆయన గొప్పవాడిగా కనిపించే ప్రయత్నం ఎన్నడూ చేయలేదు. మేధావిగా ఆయనకు ఎంత గుర్తింపు ఉన్నా ఎనిమిది పదుల వయసు నిండి నాకా, ఆయనతో మాట్లాడిన వారు ఎవరైనా ఆయన జ్ఞాన విస్తృతి చూసి ముచ్చట పడేవారు. నిబద్దత కలిగి, విలువలకు జీవితాంతం కట్టుబడిన కమ్యూనిస్టుగా విజ్ఞానఖనిగా రాఘవాచారి పేరు గాంచారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యార్థి ఉద్యమానికి ఆయన అందించిన సేవలు ఎనలేనివి. 30 ఏళ్ల పాటు విశాలాంధ్ర సంపాదకులుగా బాధ్యతలు నిర్వర్తించిన రాఘవాచారి, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా, సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ సభ్యులుగా సేవలందించారు. 1972లో విశాలాంధ్ర ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాఘవాచారి 2005 వరకు కొనసాగారు. రాఘవాచారి, హైదరాబాదులోని ఒక హాస్పిటల్‌లో చికిత్సపొందుతూ 2019, అక్టోబరు 28వ తేది తెల్లవారు జామున మరణించారు. తెలుగు పత్రికా రంగానికి ఆయన చేసిన సేవను తెలుగు ప్రజలు ఎప్పుడూ గుర్తించుకునే, ఉదాత్తమైన వ్యక్తిత్వం ఉన్న రాఘవాచారి నిస్సందేహంగా మేధావి.

# అందరూ సమిష్టిగా కలిసి పని చేద్దాం

కష్టపడి పనిచేసే వారికే పార్టీలో గుర్తింపు
అందరిని కలుపుకు వెళ్లాలని పార్టీ కేడర్ కు దిశా నిర్దేశం
పవన్ కళ్యాణ్ పోటీ చేస్తే గెలిపిస్తాం
డిసెంబర్ 9 లోపు ఓటరు వెరిఫికేషన్ పూర్తి చేయాలి
విస్తృతస్థాయి స్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకరచౌదరి



**అనంతపురం కలెక్టరేట్ అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ):** అందరూ సమిష్టిగా కలిసి పనిచేసి పార్టీని అధికారంలోకి తీసుకువద్దామని నారా చంద్రబాబు నాయుడును మళ్ళీ ముఖ్యమంత్రి చేద్దామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అనంతపురం నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశం శనివారం తపోవనంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి హాజరుకాగా, పార్టీ పరిశీలకుడు రమణారెడ్డి పాల్గొన్నారు. క్లస్టర్, యూనిట్ , బూత్ ఇన్చార్జులకు ఓటర్ వెరిఫికేషన్, బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైకుంఠం ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో అందర్నీ కలుపుకొని వెళ్లాలని, ఓటరు వెరిఫికేషన్ అంశం పై సీరియస్ గా తీసుకోవాలని, బూతు స్థాయిలో ప్రతి ఇంటిలో ఓటర్ వెరిఫికేషన్ చేయాలని, నియోజకవర్గంలో 30,680 ఓట్లు తొలగించారని , కొత్తగా 17వేల ఓట్లు పెరిగాయన్నారు. క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్ లు పని విభజన చేసుకొని పరిశీలన చేపట్టాలన్నారు. ఒక్కో యూనిట్ ఇన్చార్జి పరిధిలో ఐదు వేల నుంచి 6 వేలు ఓట్లు పరిశీలన చేయాలని బూత్ ఇంచార్జ్ 800 నుంచి 1200 ఓట్ల పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. ఇలా ప్రతిరోజు 30 ఓట్లు వెరిఫై చేయాలని, డిసెంబరు 9 లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఈ నెల రోజులు ఓటర్ వెరిఫికేషన్ ప్రముఖంగా చేపట్టాలన్నారు. కార్యకర్తలు త్యాగాలకు సిద్ధం కావాలని, కష్టపడి పని చేస్తేనే గుర్తింపు లభిస్తుందన్నారు. రుద్రంపేట పంచాయతీని ఆదర్శంగా తీసుకోవాలని పార్టీ కేడర్ కు సూచించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 9 బూతుల పెరిగాయని, వాటి వివరాలు తెలియజేశారు. బాధ్యతలు తీసుకుంటే కచ్చితంగా పనిచేయాలని లేదంటే రాబోయే రోజుల్లో ఇబ్బంది పడతారన్నారు. కష్టపడి పని చేసి అందరినీ కలుపుకొని వెళ్లాలని, పనిచేసే వారికి కచ్చితంగా గుర్తింపు ఇస్తామన్నారు. జిల్లా లోని 14 నియోజకవర్గాల్లో పార్టీని గెలిపించాలని, అన్ని నియోజకవర్గాలలో పార్టీ కోసం పని చేస్తానన్నారు. ఇంతవరకు నేను ఆరు ఎలక్షన్లు చూసానని, రెండుసార్లు గెలిచానని పేర్కొన్నారు. నగరంలోని 50 డివిజన్లలో మరో 10 కార్పొరేటర్ లను పెంచుతామని, వంద మంది నాయకులు తయారు చేస్తామని, ఎప్పుడు బయటకు రాని మాజీ ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి ప్రజల్లోకి వస్తున్నారని, చాలామంది వైసిపి వాళ్ళు పార్టీలోకి వస్తామంటున్నారని వారిని సరైన సమయంలో పార్టీలోకి ఆహ్వానిస్తామన్నారు. నగరంలోని కార్పొరేషన్ లో అవినీతి పెరిగిపోయిందన్నారు. రాజకీయాలలో ఒకటి గుర్తుపెట్టుకోవాలని, సమస్యలపై పరిజ్ఞానం పెంచుకోవాలని పార్టీ కేడర్ కు సూచించారు.

**పవన్ కళ్యాణ్ పోటీ చేస్తే గెలిపిస్తాం...** అనంతలో పవన్ కళ్యాణ్ పోటీ చేస్తే పెద్ద మెజారిటీతో గెలిపిస్తామని పేర్కొన్నారు. త్యాగానికి సిద్ధంగా ఉంటానని పేర్కొన్నారు. సీటు విషయంపై చంద్రబాబు,తానుతేల్చుకుంటామని, పొత్తులో భాగంగా పవన్ కళ్యాణ్ పోటీ చేస్తారంటే తన భుజస్కందాలపై వేసుకుని గెలిపిస్తానన్నారు. జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో గెలిపించడానికి తన వంతు కృషి చేస్తానని, అన్ని నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల పెద్ద మెజారిటీతో గెలుస్తారన్నారు.

**160 రోజులు మాత్రమే సమయం ఉంది..**

పరిశీలకులు రమణారెడ్డి

ఎన్నికలకు సమయం ఆసన్నమైనదని, ఇక 160 రోజులు మాత్రమే ఉందని, అంతా కష్టపడి పని చేయాలని పార్టీలో పని చేసే వరకే గుర్తింపు లభిస్తుందని పార్టీ పరిశీలకుడు రమణారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఆయన మాట్లాడుతూ చంద్రబాబును స్కిల్ కేసులో అక్రమంగా అరెస్టు చేసి 50 రోజులు గడిచి పోయిందని, వ్యవస్థలను మేనేజ్ చేస్తూ బెయిల్ రాకుండా చూస్తున్నారని, రాష్ట్ర భవిష్యత్తు కోసం కష్టపడిన వ్యక్తిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. బాబుకు ప్రపంచవ్యాప్తంగా మద్దతు తెలుపుతున్నారని, స్కిల్ కేసులో ఒక్క రూపాయి కూడా అవినీతి లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 43 కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడని, ఇప్పటివరకు 11 లక్షల కోట్లు అప్పులు చేశారని, రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టు కానీ ఒక రోడ్డు కానీ వేయలేదని, ప్రజలంతాఆలోచించాలన్నారు. వైసిపి ప్రభుత్వ పని అయిపోయిందని, వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, ఈ ఆరు నెలలు కష్టపడి పార్టీ కోసం పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నగరాధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శులు దేవళ్ల మురళి, తలారి ఆదినారాయణ, బుల్లె శివ బాల, గాజుల ఆదెన్న, క్లస్టర్ ఇంచార్జిలు డిష్ నాగరాజు, సరిపూటి రమణ, వన్నూరు, మార్కెట్ మహేష్, ముక్తియార్, గుర్రం నాగభూషణ, గోపాల్ గౌడ్, దలవాయి వెంకటనారాయణ సిమెంట్ పోలన్న, కుంచపు వెంకటేష్, పోతుల లక్ష్మీనరసింహులు, వంక దారి వెంకటకృష్ణ, సుభాష్ చంద్రబోస్, ఈటే స్వామి దాస్, రంగాచారి, సాకే వెంకటేష్, మనోహర్, తెలుగు మహిళలు స్వప్న, సంఘ తేజస్విని, యూనిట్ ఇన్చార్జిలు, మాజీ కార్పొరేటర్లు,బూత్ ఇన్చార్జిలు పాల్గొన్నారు.

# ప్రజలను రక్షించడంతో పాటు ప్రాణాలను నిలబెట్టడం మా కర్తవ్యం

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్
పోలీసు అమర వీరుల త్యాగాల స్ఫూర్తితో రక్తదానం చేసిన జిల్లా ఎస్పీ
జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో రక్తదాన శిబిరం



**అనంతపురం బ్యూరో అక్టోబర్ 28(జనసూర్యశ్రీ):** ప్రజలను రక్షించడంతో పాటు ప్రాణాలను నిలబెట్టడం మా కర్తవ్యమని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో జిల్లా ఎస్పీ రక్తదానం చేశారు. పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా శనివారం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా ఎస్పీ రక్తదానం చేసిన అనంతరం ప్రసంగిబుూ పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా శనివారం రక్తదాన శిబిరాలు నిర్వహించామన్నారు. ప్రజలు విరివిగా పాల్గొనాలన్నారు. రక్తదానం చేయడం అంటే ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మ కల్పించడమేనని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు, ప్రసవాలు, ఆపరేషన్ల సమయంలో రక్తం పాత్ర కీలకం అవుతుందన్నారు. అలాంటి ఆపద సమయంలో మానవత్వంతో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడటం అదృష్టంగా భావించాలన్నారు. ఈనేపథ్యంలో రక్తదానం చేయడంపై ప్రజలకు అవగాహన కల్గించాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్ విజయభాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, ఎ.హనుమంతు ( ఏ.ఆర్ ), ఏ.ఆర్ డీఎస్పీ ముని రాజు, పోలీసు డాక్టర్ వెంకటేశ్వర ప్రసాద్, ఐఎంఏ అనంతపురం బ్రాంచి అధ్యక్షుడు డాక్టర్ మనోరంజన్ రెడ్డి, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ శంకర్ గౌడ్, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ మోహన్ కృష్ణ, సి.ఐ లు విశ్వనాథచౌదరి, ఆర్ ఐ లు హరికృష్ణ, రాముడు, పలువురు ఎస్సైలు, ఆర్ ఎస్ ఐ లు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు పండ్లు పంపిణీ చేసిన వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు అశోక్ కుమార్



**తనకల్లు అక్టోబర్ 28 (జన సూర్య (శ్రీ) :** సత్యసాయి జిల్లా కదిరి నియో జవర్గం తనకల్లు మండలం కొక్కంటి క్రాస్ నందు వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు అశోక్ కుమార్ ఆధ్వరంలో వాల్మీకిమహర్షి జయంతి కార్యక్రమం ఘనంగా జరుపుకు న్నారు. వివిధ వర్గాలకు చెందిన నాయకులు ముందుగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూల మాలలు వేసిఘనంగానివాళులర్పించారు తర్వాత తనకల్లు 30 పడకల ఆసుపత్రిలో బ్రెడ్ పండ్లు పంపిణీ చేశారు. సత్యసాయి జిల్లా టిడిపి బీసీ సెల్ ఉపాధ్యక్షుడు సోంపాలెం నాగభూషణం మాట్లాడుతూ రామాయణం రచించిన ఆదికవి మహానుభావుడు వాల్మీకి మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వలస వేణు ,క్లస్టర్ ఇంచార్జ్ పీజీ మల్లికార్జున, తెలుగు మాజీ అధ్యక్షుడు గోపీనాథ్ ,సిపిఐ నాయకులు చలపతి సిద్దు గౌతం ఎస్సీ నాయకులు చిన్నప్ప చంద్రప్ప వాల్మీకి నాయకులు శ్రీరాములు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



**మడకశిర అక్టోబర్ 28( జన సూర్య (శ్రీ ) :** పట్టణ పరిధిలోని బేగార్లపల్లి గ్రామంలో వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యుడు, టిటిడి బోర్డు మెంబర్ తిప్పేస్వామి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కవిత సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ రామచంద్ర రెడ్డి, వాల్మీకి కులస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కారణజన్ముడు శ్రీ వాల్మీకి మహర్షి

డాక్టర్: భరత్ కుమార్.



**లక్కిరెడ్డిపల్లె: అక్టోబర్ 28, (జనసూర్యశ్రీ) :** ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని లక్కిరెడ్డిపల్లె లో బీసీ వేదిక ఆధ్వర్యంలో శనివారం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ భరత్ కుమార్ పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగాఆయనమాటాడుతూవాల్మీ కిమహర్షికారణజన్ముడని శ్రీరాముని జీవిత చరిత్రను రామాయణం రూపంలో దేశ ప్రజలకు అందించిన దైవాంశ సంభూతుడుఅన్నారు,ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ వైస్ చైర్మన్ విజయభాస్కర్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రచించిన రామాయణంలో పుత్రవాత్సల్యాన్నిఅన్నదమ్ముల అనురాగాన్ని భార్యాభర్తల బంధాలు ఏవిధంగా ఉండాలో చాలా చక్కగా వివరించారు అన్నారు. అయ్యప్పగురు స్వామి, వెంకటరమణయ్య మాట్లాడుతూ వాల్మీకి మహర్షి గొప్ప మహిమాన్వితుడని విష్ణు స్వరూపమే వాల్మీకి మహర్షి అని అతను ఏ ఒక వర్గానికో చెందిన వ్యక్తి కాదని సర్వ జనానికి దైవాంశ సంభూతుడని అన్నారు,ఈ కార్యక్రమంలోపి.వెంకటస్వామి, బసయ్య, రవి, రాజా, హరి, రమణయ్య, సుబ్బయ్య, కృష్ణ, వెంకటరమణ, మొదలగువారు పాల్గొని ఘనంగా వాల్మీకి జయంతిని జరుపుకున్నారు.

## నేటి యువతకు వాల్మీకి మహర్షి ఆదర్శం



**మడకశిర అక్టోబర్ 28 (జన సూర్య (శ్రీ).** పట్టణంలో ఉన్న వాల్మీకి విగ్రహానికి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఘనంగా పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారి పూజలు చేపించి అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీకు యువతకు వాల్మీకి మహర్షి ఆదర్శనీయమని కొనియాడారు. వాల్మీకి మహర్షి రచించినటువంటి రామాయణం నేటి యువతలు దానిని చదివి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. బిజెపి కిసాన్ మార్చ్ రాయలసీమ జోనల్ ఇంచార్జ్ చంద్రశేఖర్ పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు మనోహర్, నాయకులు రిటైర్డ్ ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ మల్లికార్జున, డాక్టర్ కృష్ణమూర్తి, వాల్మీకి కులస్తులు ,భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ చింతల వెంకటరమణ స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే



**తాడిపత్రి అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ) :** తాడిపత్రి పట్టణం నందు వెలిసిన శ్రీ చింతల వెంకటరమణ స్వామి వారి ఆలయం నందు నిర్వహించిన స్వామి వారి కల్యాణోత్సవంలో తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాల్గొని, స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీ స్వామి, శ్రీదేవి భూదేవి లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి , వైసిపి నాయకులు, కార్యకర్తలు భక్తాదులు పాల్గొన్నారు.

## రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలి

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్
జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



**అనంతపురం బ్యూరో అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ ):** రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతావిలువలను పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలు ఆవరణలో శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. శ్రీ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈసందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే మధుర కావ్యం రామాయణం అని అన్నారు. అటువంటి గొప్ప కావ్యాన్ని రచించి యుగాలు మారినా కూడా ఆదర్శంగా నిలిచే విధంగా వాల్మీకి మహర్షి సమాజానికి అందించడం గొప్ప విషయమన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్ విజయభాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, ఎ.హనుమంతు ( ఏ.ఆర్ ), ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజు, జిల్లా పోలీసు కార్యాలయం ఏ.ఓ శంకర్ , సిబ్బంది, సి.ఐ లు ఇందిర, విశ్వనాథచౌదరి, ఆర్ ఐ లు హరికృష్ణ, రాముడు, పలువురు ఎస్సైలు, ఆర్ ఎస్ ఐ లు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే...



**తనకల్లు /కదిరి అక్టోబర్ 28( జన సూర్య శ్రీ ) :** కదిరి మున్సిపాలిటీ, స్థానిక కుటాగుళ్ల నందు గల మహర్షి వాల్మీకి విగ్రహం వద్ద నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాల్లో కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పి వి సిద్దా రెడ్డి పాల్గొని, విగ్రహానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాకవి మహర్షి వాల్మీకి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. రామాయణ ఇతిహాసం యొక్క సంప్రదాయ రచయితగా కీర్తించబడిన వాల్మీకి మహర్షి ఆదికవిగా పూజించబడ్డారన్నారు. రామాయణం ద్వారా సామాజిక న్యాయం సమాజంలో ఏ విధంగా ఆదర్శవంతంగా ఉండాలో చాటి చెప్పిన మహర్షి వాల్మీకి అన్నారు. ఆయన అడుగుజాడల్లో వారు నిర్దేశించిన బాటలో వారి మాటలను గౌరవిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో సామాజిక న్యాయం అంటే చేతుల్లో చూపించిన నాయకుడు జగన్మోహన్ రెడ్డి అన్నారు. వాల్మీకి సామాజిక వర్గానికి సంబంధించి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాజకీయ ప్రాధాన్యత కల్పించి మంత్రివర్గంలో స్థానాన్ని, పార్లమెంటు స్థానాన్ని, ఇద్దరు ఎమ్మెల్సీలుగా స్థానాన్ని, ఐదు మంది మున్సిపల్ చైర్మన్ లుగా, కార్పొరేషన్ చైర్మన్ గా, డైరెక్టర్లుగా, జిల్లా పరిషత్ చైర్మన్ లుగా, ఉమ్మడి అనంతపురం జిల్లాలో చోటు కల్పించారన్నారు. కదిరి నియోజకవర్గం లో ఎంపీపీగా సింగల్ విండో అధ్యక్షుడుగా మొదటిసారి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజకీయ ప్రస్థానాన్ని కల్పిస్తూ సామాజిక న్యాయాన్ని జగనన్న ప్రభుత్వంలో పాటించారన్నారు. మరోసారి మహర్షి వాల్మీకి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వాల్మీకి జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



**హిందూపురం టౌన్ అక్టోబర్ 28. (జన సూర్య (శ్రీ):** హిందూపురం పట్టణం లో వాల్మీకుల ఆరాధ దైవమైన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు వాల్మీకి సుభాష్ గాంధీ ఆధ్వర్యంలో వాల్మీకి యువకులు వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలవేసి తమ భక్తిని చాటుకున్నారు. ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకొని ముందుకెళితే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందని వాల్మీకి సుభాష్ గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి యువకులు లక్ష్మీనారాయణ , చిరు, రమేష్ , వినయ్, హరి ,రాజు, రఘు పాల్గొన్నారు

## ఆర్టీసీ ఉద్యోగుల పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి.

- నల్లపల్లి, విజయ్ భాస్కర్ రాష్ట్ర అధ్యక్షులు .
- ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్.

**కుందుర్పి, అక్టోబర్ 28 (జనసూర్య శ్రీ ):-** నెల్లూరు జిల్లా కావలిలో బస్సు డ్రైవర్, కండక్టర్ పై ఉద్దేశ్యపూర్వకంగా విచక్షణ రహితంగా దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, నల్లపల్లి ,విజయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఈ ఘటన పైన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగులకు రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వానికి వుందని అన్నారు. ఉద్యోగులు, అధికారుల పై రాజకీయ వత్తిడి పెరిగిందని చెప్పారు. విధినిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన శిక్షలు అమలు అయ్యేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## ప్యాపిలి టిడిపి కార్యాలయం నందు వాల్మీకి జయంతి వేడుకలు.



**ప్యాపిలి :అక్టోబర్ : 28 (జనసూర్య శ్రీ)** పట్టణ టిడిపి కార్యాలయం నందు వాల్మీకి జయంతి వేడుకలను ప్రధాన కార్యదర్శి మెట్టుపల్లె సుదర్శన్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించడమైనది. వేడుకలో పాల్గొన్నా రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి వై.నాగేశ్వరావు యాదవ్, మాజీ ఎంపిపి ఆర్.ఈ.రాఘవేంద్ర, డోన్ నియోజకవర్గ టిడిపి యువ నాయకులు ధర్మవరం మన్నే గౌతమ్ రెడ్డి , టిడిపి నాయకులు మరియు వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

# మహర్షి జయంతి మహోత్సవ కార్యక్రమం



**హిందూపురం టౌన్ అక్టోబర్ 28. ( జనసూర్య (శ్రీ) :** వాల్మీకుల ఆరాధ దైవం వాల్మీకి మహర్షి జయంతి మహోత్సవ కార్యక్రమం హిందూపురం పట్టణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా వాల్మీకి కుల బాంధవుల తోపాటు వైసిపి టిడిపి జనసేన బిజెపి తదితర రాజకీయ పార్టీ నాయకులు వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి తమ భక్తిని చాటుకున్నారు, మేళ తాళాల తో వాల్మీకుల ముత్తైదులు బాలికలు ఎంతో భక్తి శ్రద్ధలతో జ్యోతుల మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు, చిన్న మార్కెట్ నుండి వాల్మీకి విగ్రహం వరకు వాల్మీకి మహర్షి ముత్యాల పల్లకి మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు, ఎంతో భక్తితో మహిళలు బాలికలు జ్యోతుల మోసుకొని ఊరేగింపుగా వెళ్లి వాల్మీకి మహర్షి విగ్రహం ప్రదర్శన గావించి పూజలు నిర్వహించి తమ భక్తుని చాటుకున్నారు , ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయంతో జ్యోతుల మోసిన ముత్తైదువులకు పసుపు కుంకుమ చీరలు పంపిణీ చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు, వాల్మికి సంఘం ఆధ్వర్యంలో భక్తాదులకు తీర్థప్రసాదాలు అన్నదానం గావించారు, ఈ కార్యక్రమంలో వైసీపీ సమన్వయకర్త దీపికా వేణు, టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, వైసిపి నాయకురాలు చౌళూరు మధుమతి రెడ్డి, సమాజ సేవకుడు ఏం హెచ్ ఇనాయతుల్లా , కౌన్సిలర్ రమేష్ కుమార్, వైసిపి బి బ్లాక్ కన్వీనర్ వాటర్ నరేష్, వాల్మీకి యువ నాయకుడు రామంజి, జిల్లా వైసీపీ యువజన కమిటీ ప్రెసిడెంట్ వాల్మీకి లోకేష్, లాయర్ శివకుమార్ వందలాదిమంది వాల్మీకులు తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ ఇంద్రజ మాట్లాడుతూ వాల్మీకి మహర్షికి ఎంతో ఘనమైన చరిత్ర గలదని ఆయన రచించిన రామాయణం లో సమాజానికి ఉపయోగపడే ఎన్నో ఉన్నాయన్నారు, వాల్మీకి మహర్షి ఆశయానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె పేర్కొన్నారు, ప్రతి వాల్మీకి భక్తి భావాలను పెంపొందించుకొని ఆధ్యాత్మికంగా ఎదుగుతూ సమాజ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆమె కోరారు.

## టిడిపి జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో..

## ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు..



**మదనపల్లి అక్టోబర్ 28 (జనసూర్య (శ్రీ) :** వాల్మీకి జయంతి సందర్భంగా అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని రాజంపేట పార్లమెంట్ టిడిపి కార్యాలయంలో శనివారం ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు హాజరయ్యారు. జగన్మోహన్ రాజుకు స్థానిక టిడిపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలని,జైలు నుంచి త్వరగా విడుదల కావాలని, రాష్ట్రంలో వర్షాలు సకాలంలో పడాలని వాల్మీకి మహర్షికి మొక్కుకున్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్, సీడ్స్ మల్లికార్జున నాయుడు ,వాల్మీకి సంఘం నాయకులు చీకులబైలు సర్పంచ్ ప్రభాకర్,మిద్దింటి రవి, రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి రాటకొండ మధుబాబు ,రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దొరస్వామి నాయుడు, రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్ర యాదవ్, మైనార్టీ నాయకులు పఠాన్ ఖాదర్ ఖాన్ ,భావజాన్ శ్రీరాములు రాజంపేట పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి పూల మురళి, రాజంపేట పార్లమెంట్ బెస్త సాధికార సమితి అధ్యక్షుడు ముంబై దుర్గ, తెలుగు యువత నాయకులు ముద్దుకృష్ణమనాయుడు, అమర ,శంకర ,సుబ్రహ్మణ్యం రెడ్డి, ప్రతాప్ ,శివ పాల్గొన్నారు

# జాతీయ స్థాయి సదస్సు వాల్ పోస్టర్ ఆవిష్కణ



**అనంతగిరి (అల్లూరి జిల్లా) అక్టోబర్ 28 (జన సూర్య (శ్రీ):-** నవంబర్ 14,15, తేదీలలో పాడేరు లో జరిగే నేషనల్ వైడ్ సదస్సు ను జయప్రదం చేయాలనీ అనంతగిరి ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ వాల్ పోస్టర్ రిలీజ్ చేసి కరపత్రాలు పంపిణి చేశారు. మండలంలో గల అన్ని గ్రామపంచాయతీ ప్రజలకు తెలియజేసి సదస్సు జయప్రదం చేయాలి. అందరు హాజరయ్యే విదంగా కమిటీ సభ్యులు కృషి చేయాలనీ, అన్ని ప్రజా సంఘాలు, విద్యార్థి యువజన సంఘాలు ప్రజా ప్రతినిధులు అందరు ఈ కార్యక్రమం నకు హాజరు కావాలని జేఏసీ కన్వీనర్ డాక్టర్. పి రామకృష్ణ పేర్కొన్నారు.కో కన్వీనర్ రవీంద్ర మాట్లాడుతూ ఉద్యోగం ఉపాధ్యాయ సంఘాలు జాతి మేలుకోరుకునే ప్రతి ఆదివాసీ బిడ్డ తమవంతుగా ఆర్థిక, హార్దిక సహాయ సహకారాలు అందించి సదస్సు జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ ప్రజానీక హక్కుల్ని, చట్టాల్ని తుంగలో తొక్కుతుందని, మొన్న జీఓ: 3 నిన్న బోయవాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టి జాబితాలో చేర్చడం ఇలా అనేక సమస్యలు సృష్టిస్తున్నారు. వాటిని ఉద్యమాలతో పోరాటాలతోనే కాపాడుకోవాలి లేకుంటే జాతి మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని అందుకే అందరం కలిసి కట్టుగా పోరాడి సాదించుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో పి. సన్యాసి స్వామి. అనంతగిరి గ్రామ ప్రజలు దండుసేన దొనేష్. మంగు. కృప. గురుమూర్తి. తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో

## పాల్గొన్న -మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్



**గుంతకల్లు అక్టోబర్28 (జన సూర్య (శ్రీ ) :** గుంతకల్లు నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ శాసన సభ్యుడు ఆర్. జితేంద్ర గౌడ్ ముందుగా గుంతకల్లు టీడీపీ కార్యాలయం నందు టీడీపీ శ్రేణులతో కలిసి వాల్మీకి మహర్షి చిత్రపటానికి, గుంతకల్లులో ప్రతిష్టించిన వాల్మీకి సర్కిల్, మార్కెట్ సర్కిల్, కసాపురం గ్రామాల్లో వాల్మీకి విగ్రహలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రచించినరామాయణం భావితరాలకు ఎంతో ఆదర్శమని, నియోజకవర్గ వాల్మీకి సోదర సోదరీమణులు తెలుగుదేశం పార్టీ నాయకులకు,ప్రజలకు వాల్మీకి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి పవన్ కుమార్ గౌడ్, కేసీ హరి,కేశప్ప,తలారి మస్తానప్ప,కృష్ణ రెడ్డి, ప్రతాప్ నాయుడు,రామన్న చౌదరి,హనుమంతు,ఆమ్లెట్ మస్తాన్ యాదవ్,కురుబ శివన్న బిరామాంజినేయులు,ఫజులు,సిమెంట్ నారాయణ,జింకల జగన్నాధ,సంజీవ్ వాల్మీకి రాము, ఎన్ డి పి గోపాల్,నందిశ్వర్,నాగరాజు, మహాదేవ,బండి లక్ష్మిదేవి, జయమ్మ, అంజలీ, మాధవి, బి ఎల్ లక్ష్మి,నాగేష్, పులికొండ, ఉడదల శివ,రాయల్ వెంకటేష్, టి కృష్ణ,గుమ్మనూరు వెంకటేశ్ గుంతకల్లు పట్టణం, మండలం టీడీపీ నాయకులు, కార్యకర్తలు వాల్మీకి సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీకగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్

రాజ్యాంగ స్ఫూర్తితో ఇక్కడ అన్ని మతాలు ఒక్కటే

అన్ని మతాల పర్వదినాలు ప్రాధాన్యతగా భావించి కార్యక్రమాలు

అనంతపురం రేంజ్ డి.ఐ.జి ఆర్ ఎన్ అమ్మిరెడ్డి

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సంకల్పంతో జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఘనంగా గ్యార్మీ వేడుకలు

వృద్ధ,మహిళలు అంధుల ఆశ్రమాలకు భోజనాలు పంపిన జిల్లా ఎస్పీ



**అనంతపురం బ్యూరో అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ ).** మత సామరస్యానికి ప్రతీకగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నిలుస్తుందని అనంతపురం రేంజ్ డి.ఐ.జి ఆర్ ఎన్ అమ్మిరెడ్డి అభిప్రాయపడ్డారు. శనివారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని మహబూబ్ సుబహాని దర్గాలో ఘనంగా గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అనంతపురం రేంజ్ డి.ఐ.జి, జిల్లా ఎస్పీలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్లకు సంబంధించిన ప్రార్థనా మందిరాలు ఇక్కడ ఉన్నాయని , ఆయా పర్వదినాలు జిల్లా పోలీసుశాఖ ఘనంగా నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇక్కడ అన్ని మతాల వారు ఒక్కటేననే భావనతో ఉంటున్నారన్నారు. అందరూ కలిసి మెలసి నిమగ్నం కావడం, భోజనం చేయడం శుభ పరిణామమన్నారు. పోలీసు కుటుంబాలే కాకుండా నగర ప్రజలకు ఎస్పీ సహృదయంతో మంచి భోజనాలు ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. పోలీసులకు ప్రజలు మరింత సహకారం అందించాలని కోరారు.వృద్ధ,మహిళ, అంధ ఆశ్రమాలకు భోజనం పంపిన జిల్లా ఎస్పీ పర్వదినాలు కొంత మందికే పరిమితం కాకుండా అందరూ సంతోషంగా చేసుకోవాలనే సదుద్దేశ్యంతో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అనంతపురం, పరిసరాలలో ఉన్న వృద్ధాశ్రమాలు, మహిళలు, అంధుల ఆశ్రమాలకు భోజనాలు పంపారు. గ్యార్మీ వేడుకల్లో ప్రజలు, పోలీసు కుటుంబాలకు సిద్ధం చేయించిన వంటకాలలో సుమారు 500 మందికి సరిపడా మాంసాహారం ను ప్రత్యేక వాహనంలో పంపి ఆయా వృద్ధ,మహిళ,అంధ ఆశ్రమాలకు అందజేశారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్ విజయభాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, ఎ.హనుమంతు ( ఏ.ఆర్ ), ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజు, జిల్లా పోలీసు కార్యాలయం ఏ.ఓ శంకర్ , సిబ్బంది, పలువురు సి.ఐ లు, ఆర్ ఐ లు, ఎస్సైలు, ఆర్ ఎస్ ఐ లు, లీగల్ అడ్వయిజర్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్పీ సి.సి ఆంజనేయ ప్రసాద్, జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శివ, దర్గా కమిటీ సభ్యులు మసూద్ వలీ, షేక్షావలి, నాగరాజు, ఖాదర్ వలీ, లింగమయ్య, బాబా ఫక్రుద్దీన్, దౌలా, రహిమాన్, తదితరులు పాల్గొన్నారు.

# వాల్మీకి మహర్షి అడుగుజాడల్లో పయనిద్దాం- సమాజ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం

బ్లాక్ కన్వీనర్ వాల్మీకి నరేష్



**హిందూపురం టౌన్ అక్టోబర్ 28(జనసూర్యశ్రీ).:** హిందూపురం పట్టణం లో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు రామాయణం సృష్టికర్త వాల్మీకి మహర్షి అడగజాడల్లో పయనిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పాటు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైసిపి బి బ్లాక్ కన్వీనర్ వాల్మీకి నరేష్ పిలుపునిచ్చారు ఈ సందర్భంగా హిందూపురం పట్టణంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకులకు ముఖ్య అతిథిగా వైసీపీ సమన్వయకర్త దీపికా వేణు హాజరై వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి తమ భక్తుని చాటుకున్నారు, వైసిపి బి బ్లాక్ కన్వీనర్ వాల్మీకి నరేష్ తోపాటు వాల్మీకి కమిటీ సభ్యులు వాల్మీకి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు వైసీపీ సమన్వయకర్త దీపిక వేణు, బి బ్లాక్ కన్వీనర్ వాల్మీకి నరేష్ లు వందలాదిమంది మహిళలు పురుషులు కలిసి ఊరేగింపుగా విచ్చేసి,వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి తమ భక్తిని చాటుకున్నారు, వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వైసిపి సమన్వయకర్త దీపిక వేణుకు ఘనంగా సన్మానం చేశారు.బి బ్లాక్ కన్వీ నర్ వాల్మీకి నరేష్ మాట్లా డుతూ వాల్మీకి మహర్షికి ఎం తో ఘనమైన చరిత్ర గలదని అలాంటి చరిత్ర నేటి సమాజా నికి ఎంతగానో ఉపయోగపడు తుందని ఆయన గుర్తు చేశారు, ప్రతి ఒక్కరూ భక్తి భావాలను పెంపొందించుకొని ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు, అనం తరం శ్రీనివాస వాటర్ ప్లాంట్ వద్ద వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని మహిళలకు చీరలు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు బి ఎన్ మూర్తి, వినయ్ కృష్ణ, చిరంజీవి, ముద్ద రంగప్ప, డి ఆర్ జి శ్రీనివాసులు లక్ష్మీనారాయణ కొండప్ప చెన్నప్ప, రమేష్ తిప్పన్న, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు

# జనసేన- టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం..

జగన్మోహన్ రెడ్డి పాలన ఇక ఐదు నెలలే..

జనంలోకి జనసేన పట్టణ బాట కార్యక్రమంలో రాందాస్ చౌదరి..



**మదనపల్లి అక్టోబర్ 28 (జనసూర్య (శ్రీ ) :** వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయి జనసేన- టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని జనసేన పార్టీ రాయలసీమ కోకన్వీనర్ గంగారపు రామదాసు చౌదరి తెలిపారు.మదనపల్లి మున్సిపాలిటీ 9వ వార్డులో ఆయన సమక్షంలో జనర్దన్ ఆధ్వర్యంలో జనంలోకి జనసేన పట్టణ బాట కార్యక్రమంలో భాగంగా జనసేన నాయకులు కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు . జనసేన పార్టీ కార్యదర్శి జనార్దన్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో యువతకు ఆయన కండువాలు కప్పి జనసేన పార్టీ ల ఆహ్వానించారు. ఈ సందర్భంగా గంగారపు రాందాస్ చౌదరి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలను, గాజు గ్లాసు గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్ళాలని చెప్పారు.జనసేన, టీడీపీ పార్టీలు కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, నిజం గెలిచి చంద్రబాబు నాయుడు జైలు నుండి బయటకు వస్తారని, ఈ అవినీతి అసమర్థ పాలన చేస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని పాతలానికి తొక్కేయడం గ్యారెంటీ అని తెలియజేశారు. రాష్ట్రాన్ని తలరాత మార్చాలన్న, రాజకీయా నాయకుడి తలరాత మార్చాలన్న ఓటు ముఖ్యమైనదని గుర్తు చేశారు.కాబట్టి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.రాబోయే ఎన్నికల్లో పవన్ కళ్యాణ్, చంద్రబాబు నేతృత్వంలో జనసేన ,టీడీపీ పార్టీల విజయానికి ఓట్లువేసి వేయించి ఈ దుష్ట పాలనను అంతమోదిస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివ రాం,రాష్ట్ర చేనేత విభాగ నాయకుడు అడపా సురేంద్ర, జిల్లా జాయింట్ సెక్రటరీ గజ్జల రెడ్డెప్ప,రూరల్ మండల అధ్యక్షుడు గ్రానైట్ బాబు, చంద్రశేఖర, రెడ్డెమ్మ, గడ్డం లక్ష్మిపతి,అర్జున,జవిలి మోహన్ కృష్ణ,నారాయణ స్వామి, లవన్న, విజయ్ కుమార్,పవన్, జంగాల గౌతమ్, జయ శేఖర్,నగేష్, నరేష్, వినోద్ కుమార్,బండి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి జయంతి ఉత్సవాలు పాల్గొన్న కేంద్ర పర్యటక శాఖ సహాయ మంత్రి శ్రీ పాద యశో నాయక్



**గుంతకల్లు అక్టోబర్ 28 (జన సూర్య (శ్రీ ) :** గుంతకల్లు రైల్వే డివిజన్ లో జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి శ్రీ పాద యశోనాయక్ జి ని స్థానిక బిజెపి నాయకులు కలిశారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు కొలిమి. రామాంజనేయులుఆధ్వర్యంలో రామాయణం సృష్టికర్త వాల్మీకి మహర్షిజయంతిపురస్కరించుకొని స్థానిక కసాపురం రోడ్డు మార్కెట్ దగ్గర ఉన్నటువంటి వాల్మీకి మహర్షి గుడి నందు వాల్మీకి నాయకులు మాచర్ల ఎల్లప్ప నిర్వహిస్తున్నటువంటి వాల్మీకి జయంతి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి విచ్చేసి వాల్మీకి పూజా కార్యక్రమంలో పాల్గొని విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో కొలిమి రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ నమామి గంగే రాష్ట్ర సభ్యుడు కొలిమిశేఖన్న, సీనియర్ నాయకులు హరిహర నాథ్, గుర్రం సూర్యనారాయణ, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్ ,ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీఎం మహేష్ ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షుడు రంజిత్ చౌహన్ వాల్మీకి నాయకుడు మాచర్ల ఎల్లప్ప టి పిఆర్ ట్రస్ట్ చైర్మన్ తలారి పరశు రాముడు. యువ మోర్చా నాయకుడు మహేష్ పవన్ వాల్మీకి కుల బాంధవులు భారీఎత్తున పాల్గొన్నారు

# రక్తదానం చేసి ప్రాణదాతలు కండి.



-అన్ని దానాలలో కెల్లా రక్తదానం చాలా గొప్పది. -రక్తదానం సామాజిక బాధ్యతగా తీసుకోవాలి.

-పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం.

**కుందుర్పి ,అక్టోబర్ ,28, (జనసూర్య (శ్రీ):-** సమాజంలో ఏ వ్యక్తులైన ఆపదలోవుండి నిస్సహాయ స్థితిలో సతమతం అవుతూ, రక్తం కొరత వున్న వారికి ఎవరైనా సరే వ్యక్తులు రక్తదానం చేసి వారికి తిరిగి ప్రాణం పోసేలా ప్రాణదాతలు కావాలని కుందుర్పి పోలీస్ అధికారులు పిలుపునిచ్చారు. శనివారం కళ్యాణదుర్గం పట్టణంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరంను కుందుర్పి పోలీసులు , స్థానిక ఋషి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరం కార్యక్రమంలో కుందుర్పి పోలీసు సిబ్బంది, కుందుర్పి రిషి డిగ్రీ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు రక్తదానం చేసి తమ ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టి, అరుణ, పోలీస్ అధికారులు మాట్లాడారు. సమాజంలో అన్ని దానాలలో కల్లా రక్తదానం మహా గొప్పది అన్నారు. ప్రతి వ్యక్తి రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. రక్తదానం చేయడానికి పలవరు భయపడుతున్నారని,ధైర్యంగా ముందుకు వచ్చి రక్త దానం చేయాలని కోరారు. ప్రమాదాల్లో గురైనేడు ఎంతోమంది రక్తం కొరత ఏర్పడి, గర్భిణీ మహిళలుకు రక్తం కొరత ఏర్పడి దొరకక ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే ప్రాణాపాస్థితిలో కొట్టు మిట్టు ఆడుతున్న వారికి వ్యక్తులు మానవ దృక్పథంతో రక్తదానం చేసి ప్రాణం పోసి లా పునరుద్దించడం చాలా గొప్ప విషయం అన్నారు. ప్రజల కోసం దాన,మాన ,ప్రాణాల రక్షణ కోసం పోలీసులు ప్రాణాలు పణంగా పెట్టి ఎంతోమంది అమరులయ్యారు అన్నారు. అమరులైన పోలీసులు త్యాగాలు సేవలు ఎన్నటికీ మరువలేనివని స్మరించుకున్నారు. అమరులైన పోలీసులు త్యాగాలను ఆశయాలను సూర్తిగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. రక్తదాతల సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కబ్జా గురైన శంకుపర్తి భూములు వెంటనే తిరిగి ఇవ్వాలని గ్రామస్తులు ఆందోళన



**అనంతగిరి (అల్లూరి జిల్లా) అక్టోబర్ 28 ( జన సూర్య (శ్రీ):-** గత కొన్ని ఏళ్లుగా సుమారుగా 220 ఎకరాల భూమి అనంతగిరి మండలంలోని శంకుపర్తి గ్రామ రైతుల భూములు అక్రమార్కుల వసమైన విషయం తెలిసిందే, అయితే గ్రామస్తులు,ఐటీడీఏ పిఓ కి వినతి పత్రం అందించిన ఇప్పటికి స్పందన లేకపోవడం గమర్హం. మండల రెవెన్యూ అధికారికి విన్నవించుకున్న, పట్టించుకోకపోవడం వల్ల గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి కబ్జాకు గురైన భూములు గ్రామస్తులకు వెంటనే తిరిగి ఇవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# పార్టీల కతీతంగా మహర్షి వాల్మీకి జయంతి... వాల్మీకి సంఘం అధ్యక్షుడు



**రాయదుర్గం అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ) :** ఆది పురుష మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలను డిసెంబర్ లో పార్టీల కతీతంగా ఘనంగా జరుపుకోవాలని రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి నిర్ణయించడం జరిగిందని అధ్యక్షుడు నాయకుల. బండి క్రిష్టప్ప తెలిపారు. శనివారం మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రాయదుర్గం పట్టణంలోని మారెమ్మ గుడి వద్ద ఉన్న వాల్మీకి కళ్యాణ మండపంలో ఆ సేవా సమితి కార్యదర్శి ఎన్.టి.సిద్దప్ప, ఉపాధ్యక్షుడు మనకన్న, కోశాధికారి నాయకుల బండి చంద్రశేఖర్, ఉప కోశాధికారి పై తోట రఘు, సభ్యుల, వాల్మీకి సామాజిక వర్గం సభ్యులు, మిత్రులు న్యాయవాదులు సూర్య జాన్సన్, రఘునాయక్, చిరు వ్యాపారి గాజుల భీమరాజులు తో కలిసి కుల, మతాల కతీతంగా మహర్షి చిత్రపటానికి పూల పూల మాలలు వేసి పూజలు నిర్వహించారు. సభ్యులు, వాల్మీకి కులస్తులు తో కలిసి పట్టణములోని శాంతినగర్ లో చంద్రబాబునాయుడు పార్క్ లో వెలసిన భక్త కన్నప్ప విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించి పట్టణ సమీపంలోని పై తోటలో వాల్మీకి సంక్షేమ సేవా సమితి ఉపాధ్యక్షుడు పై తోట సంజీవ ఆహ్వానం మేరకు మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ వాల్మీకి జయంతి ఘనంగా జరుపుకోవాలని ముందుగా అనుకున్నామని వాల్మీకి సంక్షేమ సేవా సమితి మహర్షి జయంతి విషయమై చర్చించగా పట్టణంలోని మార్కెట్ కూడలిలో పాత టవర్ క్లాక్ ఆవరణలో డిసెంబర్ లో మహర్షి వాల్మీకి విగ్రహం ప్రతిష్టించి, వాల్మీకి కళ్యాణ మండపం పునరుద్ధరణ పనులు పూర్తి చేసి డిసెంబర్ మొదటి వారంలో మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించారు వాల్మీకి సామాజిక వర్గం కుటుంబ సభ్యులకు తెలపడం జరిగింది. మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా వాల్మీకి సామాజిక వర్గం తో పాటు ఆయా సామాజిక వర్గాల వారు కూడా పాల్గొనవచ్చని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మానవతా విలువలకు స్ఫూర్తిదాత అయిన మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాల్లో అన్ని వర్గాల వారు పాల్గొనడంలో తప్పులేదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

**నిర్ణయం మేరకే వాయిదా... కార్యదర్శి**

వాల్మీకి సంక్షేమ సేవా సమితి కమిటీ, సభ్యుల నిర్ణయం మేరకే మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలు వాయిదా వేయడం జరిగిందని ఆ సేవా సమితి కార్యదర్శి ఎన్.టి సిద్దప్ప చెప్పారు. రెండు నెలల్లో వాల్మీకి కళ్యాణమండపం పునరుద్ధరణ పనులు పూర్తి చేసి, వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన అనంతరం రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సామాజిక వర్గం కుటుంబ సభ్యులతో కలిసి మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలు వైభవంగా జరుపుకోవాలని సంఘం నిర్ణయించిందని ఆయన తెలిపారు. డిసెంబర్లో వాల్మీకి సంక్షేమ సేవా సమితి జరూప తలపెట్టిన మహర్షి జయంతి ఉత్సవాల్లో అన్ని రాజకీయ పార్టీల వారు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ పూజా కార్యక్రమాల్లో బోయ పాటి ప్రకాష్, మాజీ కౌన్సిలర్ తిప్పేస్వామి, సిద్ధలింగప్ప, మాజీ కోఆప్షన్ సభ్యుడు పై తోట సిద్దప్ప, పై తోట ముత్తప్ప, అజయ్ టైలర్ రఘు, రాము, చంద్ర, హనుమంతు, కాలవ రవి, మల్లాపురం తిప్పేస్వామి, పట్టణంలోని లక్ష్మీనారాయణ హమాలి యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## వైయస్సార్ బీమా తక్షణ ఆర్థిక సహాయం అందజేత



**రాయదుర్గం అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ ) :** రాయదుర్గం పట్టణానికి చెందిన నాయకుల .గోవిందు (38) అకస్మాత్తుగా మృతి చెందిన విషయం తెలుసుకున్న కౌన్సిలర్ ఐనాపురం మంజునాథ్ సచివాలయ సిబ్బందితో మాట్లాడి వైయస్సార్ బీమా ద్వారా రాయదుర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు తక్షణ సహాయం క్రింద 10,000 వేల రూపాయలను మృతుని భార్య మంగమ్మకు శనివారం అందించారు.ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి రోజు మృతి చెందడం తెలియగానే వాల్మీకి సోదరులు వాల్మీకి సంక్షేమ సేవా సమితి ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లికార్జున సహాయకార్యదర్శి వాల్మీకి పవన్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, కౌన్సిలర్లు డిష్ గోవింద, వన్నూరు స్వామి, పట్టణ అధ్యక్షుడు శివప్ప , కార్తీక్ మృతుని కుటుంబాల సభ్యులకు సంతాపం సానుభూతి వ్యక్తం చేశారు.

## వాల్మీకి మహర్షి ను పూర్తిగా తీసుకోవాలి ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి



**రాయదుర్గం అక్టోబర్ 28 (జన సూర్య శ్రీ)** :మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శాలను బోధించే మధుర కావ్యం రామాయణం.గొప్ప కావ్యాన్ని రచించిన ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షిని ఆదర్శవంతంగా తీసుకోవాలని ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి ప్రజలను కోరారు. వాల్మీకి మహర్షి జయంతి ఆ రామాయణం స్ఫూర్తితో ప్రతిఒక్కరూ మానవతా విలువల ను పెంపొందించుకోవాలని ఆకాంక్షిస్తూ వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ వాల్మీకి మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

# మానవ మనుగడకు ఆదర్శప్రాయుడు మహర్షి వాల్మీకి.

**-వాల్మీకి అందరివాడు.**

**-ఘనంగా వాల్మీకి జయంతి.**



**కుందుర్పి ,అక్టోబర్, 28, (జనసూర్య శ్రీ ):-** సంస్కృత సాహిత్యంలో రామాయణ ఇతిహాసాన్ని జగతికి అందించిన, మహా కావ్యాన్ని లిఖించిన జ్ఞాన నిధి శ్రీ మహర్షి వాల్మీకి అని ఆయన మానవ మానుగుడుకు ఆదర్శప్రాయుడు కానిలిచ్చారని పలువురు వ్యక్తులు కొనియాడారు. శనివారం మండల కేంద్రమైన కుందుర్పిలో స్థానిక వాల్మీకి సర్కిల్ వద్ద వాల్మీకి జయంతి సందర్భంగా నూతనంగా నిర్మాణంలో కొనసాగిన భవన మందిరంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఆయన వేద పండితులచే ప్రత్యేక పూజలునిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి కుల బాంధవులు మాట్లాడారు. సమాజానికిమూలపురుషుడిగానిలిచి శ్రీరామ దివ్య చరిత్ర రామాయణ సుందరకాయాన్ని సంపూర్ణంగా విశ్వ మానవాళికి పరిచయం చేశారన్నారు. ఆదికవి వాల్మీకి మహర్షి దివ్య పురుషుడిని ప్రతి ఒక్కరు ఆయన సేవలను స్మరించుకోవాలన్నారు. సమాజానికి ఆదర్శప్రాయుడిగా నిలిచిన మహర్షి వాల్మీకి ఆశయ సాధనకు, ఆయన అడుగుజాడల్లో యువత నడవాలని పిలుపునిచ్చారు. వజ్ర సంఘం సంకల్పం కలిగిన వాల్మీకి కొందరివాడు కాదు అందరివాడు అన్నారు. సమాజంలో కుటుంబం బంధువయాలు ఎలా ఉండాలో విసిదీకరించిన మహా ఆదికవి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాల్మీకి సంఘం నేతలు,వాల్మీకి యువకులు పెద్ద ఎత్తున విచ్చేశారు.

## మురడిలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



**డి హిరేహల్ అక్టోబర్ 28 ( జన సూర్య శ్రీ ) :** మండల పరిధిలోని మురడి గ్రామంలో ఆదికవి వాల్మీకి మహర్షి దినోత్సవాన్ని పురస్క రించుకొని ఘనంగా వాల్మీకి జయంతి వేడు కలు శనివారం జరిగాయి. ఎంపీటీసీ.టి గంగాధర్,మాజీ ఎంపీటీసీ.పరం ధామ, బిహనుమంతప్ప,సి.జైరామ, పి. రామా ంజ నేయులు,పి చన్న వీర వాల్మీకి యువ కు లు, వాల్మీకి కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పుస్తకాల్లో ఇండియా పేరు స్థానంలో భారత్ అని చేర్చడాన్ని వ్యతిరేకించిన కాంగ్రెస్





**కదిరి అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ):** విద్యార్థులు చదువుకునే పార్టీ పుస్తకాలలో అనాదిగా వస్తున్న ఇండియా పేరు స్థానంలో భారత్ అనే పేరును చేర్చడం భారతదేశ చరిత్రలో వక్రీకరణకు పూనుకున్న నేషనల్ ఎడ్యుకేషన్ రీసెర్చ్అండ్ ట్రైనింగ్ సిఫారసు చేయడాన్ని ఏపీసీసీ ఆర్గనైజేషన్ సెక్రెటరీ ఇమ్దాదుల్లా ఖాన్ , కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎం అమానుల్లా తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి పార్టీ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ కలిపి కూటమిగా ఏర్పడి బిజెపి విధానాలను వ్యతిరేకిస్తుండడం బిజెపికి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి కంటిమీద కునుకు లేకుండా పోయింది. దానిలో భాగంగానే ఇండియా పేరుపై రాద్ధాంతం చేస్తుంది. భారతీయ జనతా పార్టీ పిల్లలు చదువుకునే పాఠ్యపుస్తకాలపై కూడా వీరి ప్రతాపం చూపడం దుర్మార్గం శోచనీయం బిజెపి పార్టీని నరేంద్ర మోడీని వ్యతిరేకించే ప్రతిపక్షా పార్టీలు అన్ని ఇండియా కూటమిగా నామాకరణం చేసుకున్న తర్వాత ఇండియా కూటమికి భయపడి ఆ పేరును లేకుండా చేయాలని దుర్మార్గమైన ఆలోచన చేస్తుంది. భారతీయ జనతా పార్టీ ఎప్పుడో పురాణ కాలంలో భారత్ అనే పేరును ఇండియాకు ఉందని వీరి 9 ఏళ్ళ పరిపాలనలో గుర్తుకు రాని పురాణాలు ఇప్పుడే గుర్తుకొచ్చాయా అని ప్రశ్నించారు. 2024 ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలన్నీ కలిపి ఇండియా కుటిమిగా ఏర్పాటు చేసుకుని ఎన్నికలకు సిద్ధమవుతుండగా ఈ ఇండియాకూటమిని ఎదుర్కోలేక భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోడీ వాళ్ళ దొంద నీతికి నిదర్శనం అన్నారు. భారతదేశ స్వాతంత్ర పోరాటంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా హిందూ ,ముస్లిం అనే తేడా లేకుండా ప్రతి భారతీయుడు ప్రతి భారతీయ రాజులు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా స్వాతంత్ర సంగ్రామంలో పాలుపంచుకున్నారు. ఆనాటి ముస్లింల యొక్క చరిత్రను ముస్లిం రాజుల చరిత్రను తొలగించి వీరి చరిత్రను మార్చి రాయాలని చూస్తోందని ఇటువంటి నిర్ణయాన్ని తీసుకోవడం దుర్మార్గమైన చర్యగా దీన్ని పూర్తిగా ఖండిస్తూ దీనిని ప్రజాస్వామ్య వాదులందరూ ప్రతిపక్ష పార్టీలన్నీ కేంద్ర ప్రభుత్వం బిజెపి పార్టీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని తిప్పి కొట్టాలని ఎన్సి ఈఆర్టీ సిఫారసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆనాదిగా వస్తున్న ఇండియా పేరును యధాతథంగా కొనసాగించాలని ఆనాటి చరిత్రను వక్రీకరణ చేయరాదని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు పాల్గొనట్లు పేర్కొన్నారు

## మంద కృష్ణ మాదిగ పాదయాత్రకు మద్దతుగా డిహెచ్పిఎస్ పాదయాత్ర

**మడకశిర అక్టోబర్ 28 (జన సూర్య శ్రీ )** :పట్టణం పరిధిలోని సిద్దగిరి గ్రామంలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర చేస్తున్న మందకృష్ణ మాదిగ కు మద్దతుగా చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెచ్ పి ఎస్ వ్యవస్థాపకుడు ఆర్ హనుమంతు హాజరయ్యారు. కార్యక్రమానికి విచ్చేసి మాదిగ ఉద్యోగుల సమైక్య నాయకుల డాక్టర్ శివన్న, రామకృష్ణ, రంగస్వామి ,రంగప్ప పాల్గొని గ్రామ ప్రజలతో పాటుగా సిద్ధగిరి బస్టాండ్ నుండి ఎస్సీ కాలనీ కమిటీ హాల్ వరకు పాదయాత్ర చేస్తూ మందకృష్ణ మాదిగ పట్టిన పాదయాత్రకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా డిహెచ్పిఎస్ వ్యవస్థాపకుడు ఎంఆర్ హనుమంతు మాట్లాడుతూ ఎస్సి ఉమ్మడి రిజర్వేషన్ల వల్ల దశబ్దాలుగా విద్య,ఉద్యోగ సంక్షేమ ,రాజకీయ రంగాలలో తీవ్రంగా నష్టపోయిన మాదిగ ,మాదిగ ఉపకులాల పక్షాన నిలబడి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జరపాలని ఎమ్మార్పీఎస్ గత 29 ఏళ్ళగా డిహెచ్పిఎస్ గత 19 ఏళ్ళగా ఉద్యమిస్తున్న విషయం అందరికీ తెలిసిందే నన్నారు. మాదిగలను ఉప కులాలను ఒక తాటిమీదకు తీసుకురా వడంతో ఉద్యమం ఉప్పెనల లేచిందన్నారు. దీనితో నాటి టిడిపి సర్కార్ ఎస్సీ వర్గీకరణ పై దృష్టి పెట్టే పరిస్థితి ఏర్పడ్డాయి.దశాబ్దాలుగా అన్ని రంగాల్లో నష్టపోయిన మాదిగలకు,ఉప కులాలకు న్యాయం జరిగేలా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జరగాల్సిందేనని వివిధ కమిషన్లు సిఫారసు చేశారు. ఆ కమిషనర్ల నివేదికలు వెంటనే అమలు జరగాలని డిమాండ్లతో ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఉధృత రూపం దాల్చడంతో 2000 సంవత్సరం ప్రారంభంనుండి మొదలుకొని 2004 నవంబర్ 5 వరకు ఎస్సీ వర్గీకరణ అమలు జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణలు జరిగిన దాదాపు నాలుగున్నర ఏళ్ళ కాలంలోని మాదిగ ,ఉపకులాల విద్యార్థులకు విద్యారంగంలో ఉన్నత విద్యా అవకాశాలు నిరుద్యోగులకు ఉద్యోగ రంగంలో 22,500 ఉద్యోగాలు లభించి న్యాయం జరిగిందన్నారు. అమలు జరిగిన ఐదు ఏళ్ళు కాలంలోని వచ్చిన విద్య, ఉద్యోగ, అవకాశాల ద్వారా మాదిగ జాతి ,ఉపకులాలు అప్పుడప్పుడే అభివృద్ధిలోకి వస్తున్న సమయంలోనే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక శక్తులు మాలల్లోని కొంతమంది స్వార్థపర శక్తులు సాంకేతిక కారణాల సాకుతో సుప్రీంకోర్టు ద్వారా మన ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ 2004 నవంబర్ 5 తేదీన అడ్డుకున్నారన్నారు. అప్పుడే మరో పోరాటానికి నాంది పలుకుతూ డిహెచ్పిఎస్ ఉద్యమాన్ని 2004లో ప్రారంభించబడిందని గుర్తు చేశారు. నవంబర్ 7న జరుగు చలో హైదరాబాద్ కార్యక్రమానికి లక్షలాదిమంది మాదిగలు ఉపకులాలు కలిసి విశ్వరూప మహాసభకు కదిలి వచ్చి పాదయాత్ర జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు తిప్పేస్వామి కళ్యాణ,నగేష్,రాజు,దప్పు కళాకారులు,కార్మికులు, మహిళలు యువకులు పాల్గొన్నారు.

## రొయ్యలు & చేపల ఫుడ్ ఫెస్టివల్ ను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలి

**జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి**

**పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న ఫిషరీస్ డి డి శాంతి**



**అనంతపురం, అక్టోబర్ 28 : (జన సూర్య శ్రీ) :** రొయ్యలు & చేపల ఫుడ్ ఫెస్టివల్ ను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి పేర్కొన్నారు. శనివారం అనంతపురం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో రొయ్యలు & చేపల ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రొయ్యలు %ద% చేపల ఫుడ్ ఫెస్టివల్ ను ఆహారప్రియులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఫిషరీస్ డిడి శాంతి మాట్లాడుతూ నవంబర్ 3, 4, 5వ తేదీల్లో కర్నూలు నగరంలోని రావూరి గార్డెన్స్ లో రొయ్యలు %ద% చేపల ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తుండగా, ఈ ఉత్సవాన్ని మత్స్య శాఖ, భూమి ఆర్గానిక్‌లతో నిర్వహిస్తోందని, ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, ఫిషరీస్ ఇన్చార్జి డిడి చంద్రశేఖర్ రెడ్డి, డిఆర్డిఏ మరియు హౌసింగ్ పీడీ నరసింహారెడ్డి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, వివిధ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి విగ్రహంకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన మంత్రి ఉషాశ్రీచరణ్



**కళ్యాణ దుర్గం అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ) :** కళ్యాణ దుర్గం పట్టణంలో వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవి.ఉషాశ్రీచరణ్ వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈసంర్భంగా ఆమె ప్రసంగిస్తూ మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శాలను బోధించే మధుర కావ్యం రామాయణ గొప్ప కావ్యాన్ని రచించిన ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలిపారు.ఆ రామాయణం స్ఫూర్తితో ప్రతిఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు

## మాధవ్ అనుచిత వ్యాఖ్యలు మానుకో

**మాసూల చంద్రమోహన్**

**అనంతపురం అక్టోబర్ 28 (జనసూర్య శ్రీ) :** హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ ఒక ప్రజా ప్రతినిధి గా వుండి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటని,ఇలాంటి మాటలు మానుకోవాలని జిల్లా తెలుగుదేశంపార్టీ నాయకుడు మాసూల చంద్రమోహన్ తీవ్రంగా ఖండించారు.మొన్నటి రోజున బికేఎస్ వైసీపీ బస్సు యాత్ర పబ్లిక్ మీటింగ్ లో ఎంపీ గోరంట్లమాధవ్ వీధి రౌడీలా 2024లోజగన్మోహన్ రెడ్డి సీఎం అవుతారు, చంద్రబాబునాయుడు చస్తాడు అని చాలెంజ్ చేస్తున్నాడంటే మాధవ్ కి వచ్చే ఎన్నికలలో టికెట్ రాదని తెలిసే ఇలాంటి విమర్శలు చేస్తూన్నారని అన్నారు. చంద్రబాబును విమర్శించే అర్హత మాధవ్ కు లేదని,ఈ ప్రభుత్వం చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టడం, బాధ్యత గల ఒక ఎంపీ పబ్లిక్ గా ఛాలెంజ్ చేస్తున్నారంటే సీఎం జగన్మోహన్ రెడ్డి నిజంగానే మా అధినాయకుడైన చంద్రబాబు నాయుడు కి ప్రాణహాని తలపెట్టాడు అనే విషయం ఈ రాష్ట్ర ప్రజలకు అర్థమవుతున్నదని చంద్రమోహన్ తెలిపారు. చంద్రబాబు కి ఎలాంటి ప్రమాదం జరిగినా దానికి పూర్తి బాధ్యత సీఎంవైఎస్ జగన్మోహన్ రెడ్డి దే బాధ్యతని చంద్రమోహన్ హెచ్చరించారు

# సాంకేతికతతో వ్యవసాయంలో లాభాలు

నూతన ఆవిష్కరణలతో రైతుకు మేలు

జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్





**అనంతపురం, అక్టోబర్ 28 : (జన సూర్య శ్రీ బ్యూరో) :** సాంకేతికతను అందిపుచ్చుకుంటే వ్యవసాయ రంగంలో ఊహించని విధంగా లాభాలు పొందవచ్చని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ అన్నారు. శనివారం అనంతపురం నగరంలోని జిఎం ఆగ్రో ఇండస్ట్రీస్ అధినేత జిలాన్ భాష ఏర్పాటు చేసిన నూతన బూమ్ స్ప్రేయర్ల షోరూంను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సం దర్భంగా రైతులకు అవసరమైన వివిధ రకాలైన యంత్రాలు పనిముట్లను జెసి పరిశీలించారు.లిఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో పండ్ల తోటల సాగుతో పాటు పాడి పరిశ్రమ, ఇతర వ్యవసాయ పంటలు విస్తారంగా సాగు అవుతున్నాయన్నారు. వ్యవసాయ కూలీలు ఇతరత్రా సమస్యల నుంచి బయటపడేందుకు యంత్రాలను విరివిగా ఉపయోగిస్తే రైతుకు ఖర్చు తగ్గడమే కాకుండా మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులను వ్యవసాయ రంగానికి తీసుకు వస్తుండడం వల్ల వాటిని ఉపయోగించుకుని మంచి ఫలితాలను సాధించవచ్చని తెలిపారు. జిఎం ఆగ్రో సంస్థ జర్మనీ జపాన్ తదితర దేశాలకు సంబంధించిన టెక్నాలజీ ఆధారంగా స్వదేశంలోనే రైతులకు ఉపయోగపడే బూమ్ స్ప్రేయర్లు అతి తక్కువ ధరకు అందిస్తున్నారని తెలిపారు. ఎనిమిది లక్షల రూపాయలు విలువ చేసే ఈ స్ప్రేయర్లు కేవలం 3 లక్షలకే ఇవ్వడమే కాకుండా పది సంవత్సరాల పాటు సర్వీసింగ్ ఇతర సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. పండ్ల తోటలకు మందులు కొట్టడానికి కూలీలు ఇతర సమస్యల కారణంగా రైతులు ఎంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. స్ప్రేయర్లను వాడటం వల్ల రైతుకు ఎంతో అనుకూలంగా ఉండడమే కాకుండా తక్కువ ఖర్చుతో మందు కొట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇంతే కాకుండా ఆవుల నుంచి పాలు పితకడానికి మిల్చింగ్ యూనిట్లు, చెట్లలో ఉన్న కలుపు తీయడానికి చిన్నపాటి ట్రాక్టర్లు, పండించిన ధాన్యాన్ని తూర్పు ఆరబెట్టడానికి మిషన్లు ఇలా రైతాంగానికి ఉపయోగపడే అనేక రకాలైన యంత్ర పరికరాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలోనే అనంతపురంలో ఈ వ్యవసాయ పరికరాలు అందిస్తున్న ఏకైక సంస్థగా జీఎం ఆగ్రోస్ ఎదగడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జిఎం అగ్రోస్ ఎండి జిలాన్ భాష మాట్లాడుతూ కరువు జిల్లాలో రైతులు సాగు చేసిన పంటల్లో కలుపు తీయడానికి ఇతరత్రా పనుల కోసం కూలీల సమస్య అధికంగా ఉందన్నారు. కేవలం ఒకరిద్దరితో అన్ని పనులు చక్కదిద్దుకునే విధంగా అవసరమైన యంత్రాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఇతర ప్రాంతాలకు సంబంధించిన టెక్నాలజీతో అనుసంధానం చేసుకొని దేశీయంగా వీటిని ఉత్పత్తి చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపిపిడి ఫిరోజ్ ఖాన్, హార్టికల్చర్ డిడి రాఘునాథ రెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రీసర్వేలో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను సకాలంలో పూర్తిచేసేందుకు చర్యలు

హెచ్.ఎల్.సి కింద చివరి దశలో ఉన్న పంటలను కాపాడుకునేందుకు అదనపు నీటిని విడుదల చేయాలి

వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డికి వివరించిన జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి



**అనంతపురం బ్యూరో, అక్టోబర్ 28( జనసూర్యశ్రీ ) :** విజయవాడ నుంచి శనివారం ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులు, రెవెన్యూ, రీసర్వే, జాతీయ రహదారులకు భూసేకరణ, ఎంపీఎఫ్సి గోడౌన్ లకు భూ కేటాయింపు, వ్యవసాయం, పశుసంవర్ధక, డెయిరీ డెవలప్మెంట్, హౌసింగ్, ఇంటి పట్టాలు, ఇళ్ల నిర్మాణం, పీఆర్ మరియు ఆర్డీ ప్రాధాన్యత భవనాలు, ఉపాధి హామీ – వేజ్ జనరేషన్, స్వామిత్ర, జల్ జీవన్ మిషన్, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్లోని వీసీ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్ఓ గాయత్రీ దేవి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా జిల్లాలో మూడవ దశలో 35,088 స్టోన్ ప్లాంటేషన్ చేపట్టాల్సి ఉందని, సకాలంలో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. ఇప్పటికే మూడవ దశలో ఎనిమిది గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లాలో హెచ్.ఎల్.సి కెనాల్ కింద 21 వేల హెక్టార్లలో వరి సాగు చేయడం జరిగిందని, అలాగే మిరప పంట 34 వేల ఎకరాల వరకు సాగు చేయడం జరిగిందని, హెచ్.ఎల్.సి నీరు నవంబర్ 10వ తేదీ నుంచి ఆగిపోతున్న నేపథ్యంలో నీరు ఆగిపోతే చివరి దశలో ఉన్న పంటలను కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారని, కర్ణాటక వారితో మాట్లాడి అదనపు నీటిని విడుదల చేయాలని కోరారు. జిల్లాలో శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కింద వేతనాలు, మరమ్మతులకు సంబంధించి 27 కోట్ల రూపాయలు పెండింగ్ ఉందని, ఇందుకోసం అవసరమైన బడ్జెట్ ను మంజూరు చేయాలని కోరారు. శ్రీ సత్యసాయి తాగునీటి పథకానికి సంబంధించి పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే సోమవారంలోగా ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సిపిఓ అశోక్ కుమార్ రెడ్డి, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, డిఆర్డిఏ మరియు హౌసింగ్ పీడీ నరసింహారెడ్డి, డ్వామా పిడి వేణుగోపాల్ రెడ్డి, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రూప్లనాయక్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజారావు, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, పశు సంవర్ధక శాఖ జెడి సుబ్రమణ్యం, డిసిఓ ప్రభాకర్ రెడ్డి, స్పందన తహసీల్దార్ వాణిశ్రీ, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇహషాన్ బాషా, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ బాలాజీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలు ప్రశాంతంగా, సంతోషంగా జీవిస్తారు





జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో ఉచిత మెగా మెడికల్ క్యాంపు

కిమ్స్ సవీర ఆసుపత్రి సౌజన్యంతో వివిధ ఆరోగ్య పరీక్షలు

మీడియా ప్రతినిధుల ఆరోగ్య పరీక్షల కోసం ప్రత్యేక కౌంటర్

**అనంతపురం బ్యూరో అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ) :** పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలు ప్రశాంతంగా, సంతోషంగా జీవించవచ్చని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభిప్రాయపడ్డారు. పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా శనివారం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లోని శ్రీ కోదండ రామాలయ కళ్యాణ మండపంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమం ముఖ్యమన్నారు. ప్రధానంగా సిబ్బంది ఆరోగ్యం మెరుగుకు అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం అదనపు ఎస్పీలు ఆర్ విజయభాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజు, సి.ఐ దేవానంద్ ఆర్ ఐ లు హరికృష్ణ, రాముడులు , పలువురు పోలీసు సిబ్బంది బి.పి, షుగర్ పరీక్షలతో పాటు ఇ.సి.జి, 2 డి ఎకో టెస్టులు చేయించుకున్నారు. కార్డియాలజిస్ట్, జనరల్ ఫిజిషియన్ లతో చెక్ చేయించుకుని ఆరోగ్య పరిస్థితులనుతెలుసుకున్నారు. మొత్తం 120 మందికి పరీక్షలు చేయగా 08 మందికి గుండె సంబంధిత , జనరల్ సర్జరీకి సంబంధించిసమస్యలు ఉన్నట్లు తేలింది.

**మీడియా ప్రతినిధుల ఆరోగ్య పరీక్షల కోసం ప్రత్యేక కౌంటర్**

ఉచిత మెగా మెడికల్ క్యాంపులో మీడియా ప్రతినిధులు ఆరోగ్య పరీక్షల నిమిత్తం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. బి.పి, షుగర్ పరీక్షలతో పాటు ఇ.సి.జి, 2 డి ఎకో టెస్టులు చేశారు. ఇలా సుమారు 15 మంది మీడియా ప్రతినిధులు ఈ టెస్టులు చేయించుకున్నారు. అనంతరం కార్డియాలజిస్ట్, ఫిజిషియన్ లతో చెక్ చేయించుకుని ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు.ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్ విజయభాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, ఎ.హనుమంతు ( ఏ.ఆర్ ), ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజు, పోలీసు ఆసుపత్రి వైద్యులు వెంకటేశ్వర ప్రసాద్, కిమ్స్ సవీర కార్డియాలజిస్ట్ డాక్టర్ ఫల్గుణ్, జనరల్ ఫిజీషియన్ రాంకుమార్ మేనేజర్ రమేష్, సి.ఐ దేవానంద్, విశ్వనాథ్ చౌదరి, ఆర్ ఐ లు హరికృష్ణ, రాముడు, పలువురు ఎస్సైలు, ఆర్ ఎస్ ఐ లు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# సిఎం జగన్ ఓటమి భయంతో చంద్రబాబు పై అక్రమకేసులు

జిల్లాటిడిపి అధ్యక్షుడు బికే పార్థసారథి

**పెనుకొండ అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ ) :** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఓటమి భయంతో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పై అక్రమకేసులు పెట్టి అరెస్ట్ చేయించారని శ్రీసత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే బికే పార్థసారథి అన్నారు.శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఆయన అధ్వర్యంలో టిడిపి పెనుకొండ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు ని అక్రమ అరెస్టు, పార్టీ శ్రేణులపై జరిగిన దమనకాండ, జగన్ రెడ్డి కక్షపూరిత చర్యలేనని వివరించారు. స్కిల్ డెవలప్మెంట్, ఇన్నర్ రింగ్ రోడ్, ఫైబర్ గ్రిడ్ అంటూ ఒకదాని తర్వాత మరో కేసులు పెడుతున్నారు. టిడిపి హయాంలో 6 లక్షల కోట్ల అవినీతి జరిగిందంటూ సీఎం జగన్ సహా వైసిపి నేతలంతా ఆరోపించారు.కానీఅధికారంలోకి వచ్చి నాలుగేళ్లయిన 60 రూపాయలు అవినీతిని కూడా నిరూపించలేకపోయారన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డెవలప్మెంట్ ఏర్పాటు చేశారు, జగన్ రాజకీయ కక్షతోనే దాన్ని నిర్వీర్యం చేసి యువతకు ఉపాధి లేకుండా చేశారు. ఈ కేసు రిమాండ్ రిపోర్టు పేజీ నెంబర్ 16 లో ఒక పేరాలో 145.37 కోట్లని మరో పేరాలో 279 కోట్లు అని పేజీ నెంబర్ 21లో ఈ సొమ్ము అంతా ఎటు పోయిందో ఎవరు ఖాతాల్లోకి వెళ్లిందో తెలియదని ఉంది డబ్బు ఎంతో తెలియకుండా ఎవరి ఖాతాలోకి వెళ్లిందో తేలకుండా చంద్రబాబు తప్పు చేశాడని ఎలా అంటారు? ఫైబర్ పై ఖర్చు 280 కోట్లు ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం 900 కోట్లు నిజం, అవినీతే అబద్ధం .వైసీపీ హయాంలో నేరస్తులు బయట తిరుగుతున్నారు, అమాయకులు జైల్లో ఉన్నారు. పెనుకొండ నియోజకవర్గములో ప్రతి బూత్ నుండి కుటుంబ సాధికార సభ్యులను ఎన్నుకోవాలని తెలిపారు. అభివృద్ధికి కృషి చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదే అన్నారు. కియా పరిశ్రమ, గొల్లపల్లి రిజర్వాయిర్, పెనుకొండ నియోజకవర్గములో మారుమూల గ్రామాలకు సైతం రహదారుల, సిమెంట్ రోడ్లు మొదలైన అభివృద్ధి పనులు చేశాము. బాబు ష్యూరిటి, భవిష్యత్తు గ్యారంటీ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అందరూ కలిసి కట్టుగా పని చేసి విజయం సాధించాలని, అధినేత చంద్రబాబు నాయుడు ని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ నియోజకవర్గ పరిశీలకుడు పి జి నరసింహులు యాదవ్, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి జివిపి నాయుడు,టిడిపి జిల్లా కార్యదర్శి చిన్న వెంకటరాముడు,నియోజకవర్గం టిడిపి అధ్యక్షుడు చిన్నప్పయ్య,టిడిపి యాదవసాధికార నాయకుడు కేశవయ్య,టిడిపి అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, పెనుకొండ నియోజకవర్గంలోని 5మండలాల కన్వీనర్లు సిద్దయ్య,లక్ష్మీరెడ్డి,సిద్దలింగప్ప,నరహరి,ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇంచార్జిలు, రాష్ట్ర కమిటీ నాయకులు, కౌన్సిలర్లు, మాజీ వార్డ్ మెంబర్లు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, ప్రస్తుత సర్పంచ్ లు,మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, యూనిట్ ఇంచార్జిలు, బూత్ లెవల్ ఏజెంట్లు, రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ అనుబంధ సంఘాల నాయకులు, టీడీపీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, టిఎన్ఎస్ఎఫ్, టిఎన్ టియుసి, నాయకులు, కార్యకర్తలు ఎన్.బి.కె, ఎన్టీఆర్ అభిమాన సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# మూడ్రోజుల కిందట జరిగిన హత్య కేసును ఛేదించిన నార్పల పోలీసులు

ఆరుగురు నిందితులు అరెస్టు.

మద్యం తాగించి కడతేర్చినట్లు వెల్లడి

**నార్పల అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ) :** మూడు రోజుల కిందట జరిగిన సిద్ధవటం నారాయణస్వామి హత్య కేసును నార్పల పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఆరు మంది నిందితులను శనివారం అరెస్టు చేశారు.నార్పల మండల కేంద్రంలోని నడిమి దొడ్డి పెరవలి కుళ్లాయప్ప,ఆకుల మణికంఠ,ఆసాది జయరాం, వరికూటి శివ, కడపల నాగన్న, ఎగువ కుళ్లాయస్వామి నిందితులను ఈ హత్య కేసుకు సంబంధించి పోలీసులు అరెస్టు చేశారు.ఈనెల 24 న సిద్ధవటం నారాయణస్వామి హత్యకు గురైన విషయం తెలిసిందే. అనంతపూర్ రురల్ డీస్పీ వెంకట శివారెడ్డి ఆధ్వర్యంలో శింగనమల సి.ఐ అస్రార్ బాషా, నార్పల ఎస్సై రాజశేఖర్ రెడ్డిలు ఈ హత్య కేసును ఛేదించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో పక్కా రాబడిన సమాచారంతో నార్పల గ్రామ శివారులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలో ఈ ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.అరెస్టయిన నిందితుల్లో పెరవలి కుళ్ళాయప్ప ముఖ్యుడు. ఈచర్ వ్యాన్ డ్రైవరు గా పనిచేస్తున్నాడు. ఈతను సిద్దవటం నారాయణ స్వామి మంచి స్నేహితులు. ఇద్దరూ అప్పుడప్పుడు కొంతమంది స్నేహితులతో కలసి మద్యం సేవించే పార్టీలకు వెళ్ళుతుంటారు. పెరవలి కుళ్లాయప్పకు నార్పలకు చెందిన ఓ వివాహిత మహిళతో గత మూడు సంవత్సరాల నుండి సాన్నిహిత్యం వుంది. వీరి మధ్య ఉన్న ప్రేమ మారి పెళ్లి చేసుకోవాలనే దాకా వెళ్లింది. ఈక్రమంలో సదరు వివాహిత పట్ల సిద్ధవటం నారాయణ స్వామి అసభ్యంగా ప్రవర్తించాడని ఈ విషయంలో వీళ్లిద్దరి మధ్య గొడవ జరిగింది. అప్పటి నుండీ సిద్ధవటం నారాయణస్వామిని ఎలాగైన చంపాలనినిర్ణయించుకున్నాడుఈనెల 24న పథకం పన్ని మణికంఠ, జయరాం, నాగన్న, శివ, కుళ్లయిస్వామిలను కూడగట్టు కొని నారాయణస్వామిని మద్యం త్రాగుదామని కేశవరెడ్డి తోటకు పెరవలి కుళ్లాయప్ప తీసుకెళ్లాడు. మద్యం సేవించిన తర్వాత నారాయణస్వామికి మత్తు ఎక్కువ కావడం వలన అక్కడే పడిపోయాడు.ఇదే అదునుగా భావించిన పెరవలి కుళ్లాయప్ప అకస్మాత్తుగా రాయితో సిద్ధవటం నారాయణస్వామిపై దాడి చేసి చంపినట్లు నిందితుడు విచారణలో వెల్లడించాడు. ఈ విషయంలో మిగితా వారిని ఎవరికైనా చెబితే నేరం మీ మీదకు వస్తుందని బెదిరించాడు. అయినప్పటికీ పోలీసులు చాకచక్యంగా కేసును ఛేదించారు.



# మృతులకుటుంబాలకు ఒక్కొక్కరికి రూ"5లక్షలు ప్రభుత్వ సహాయం

చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే శంకరనారాయణ.

**పెనుకొండ అక్టోబర్ 28 (జనసూర్యశ్రీ ) :** కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్ సమీపంలో ఈనెల 26వతేదిన రోడ్డుపై ఆగి ఉన్న ట్యాంకర్ ను టాటా సుమో ఢీకొని ఘటనలో శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన 10మంది దుర్మరణం చెందారు. మృతుల్లో గోరంట్ల , ఓడి చెరువు మండలాలకు చెందినవారు ఆరుగురు, పెనుకొండ మండలానికి చెందినవారు ఇద్దరు, చిలమత్తూరుమండలం, కొత్తూరు కు చెందిన ఇద్దరు ఉన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం ప్రకటించింది. శనివారం సాయంత్రం పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మృతి చెందిన కుటుంబాలకు స్థానిక శాసనసభ్యుడు మాలగుండ్ల శంకర నారాయణ చేతులు మీదుగా ఒక్కొక్క కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డిఓ భాగ్య రేఖ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



Printer,Publisher and owned by: OGETI BHASKARA, printed at M/S Bhaskara publications,Bhairava nagar,anantapuramu, Andhra Pradesh,Published from Dno 5/134, 7th cross, Bhairava nagar,anantapuramu,515001. State editor:ogeti BhaskaraCell :9440520683Email.bhaskar.ogeti@gmail.com R.N.I.no-APTEL16159